Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930 · జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 80 • సంచిక: 50 • 27-11-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
దంతవైద్యశాల
నెల్లూరు. సెల్: 99083 22007

లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్
2303300

# గాలి జోరుకు బ్రేక్!

ఓబుళాపురం గనులపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. సుప్రీంకోర్టు సాధికారిక కమిటీ ఇచ్చిన నివేదిక, చేసిన సిఫార్సులను అవకాశంగా తీసుకొని గనుల త్రవ్వకాలను నిలిపివేసింది. మరొకప్రక్క సిబిఐ విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రిగా రోశయ్య తీసుకొన్న సాహసోపేత చర్యలివి. ఓబుళాపురం గనులతో వైఎస్ కుటుంబానికి వున్న సంబంధం జగమెరిగిన సత్యం. వాటిద్వారా గాలి జనార్ధనరెడ్డికి రోజుకు ఐదారు కోట్ల వరకు రాబడి వస్తుంటే, అందులో సగం జగన్ ఖాతాలో బదలీ అవుతున్నదని చెప్తారు. ఇంత భారీగా డబ్బు పోగు పడడం వల్లనే గాలి జనార్ధనరెడ్డికి ధన మదం తలకెక్కి అటు కర్నాటక ఇటు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలను గడగడ లాడించే స్థాయికి ఎదిగాడు. వైఎస్ బ్రతికి వున్నంతకాలం ఆయనకు ప్రభుత్వాన్ని పాదాక్రాంతం చేశారు. అడవులను ఆక్రమించినా, ఇరుగుపొరుగు గనులలో దౌర్జన్యంగా ఖనిజం త్రవ్వినా, అనంతపురం - కృష్ణపట్నం రోడ్డు మార్గంలో లారీల క్రిందపడి రోజుకు పది మంది వరకు నెత్తుటి ముద్దలుగా మారినా, రోడ్లు సర్వనాశనమైపోయినా, ఆ దారి పొడవునా వున్న వందలాది గ్రామాల ప్రజలు ఎర్రటి దుమ్ముతో నానా బాధలు పడుతున్నా పట్టించుకోలేదు. ఈ అక్రమాల నివారణకు ఏ అధికారీ ప్రయత్నం చేయకుండా అండగా నిలిచాడు. గాలిని నియంత్రించడం ఇక ఎవరితరమూ కాదనే పరిస్థితులలో సుప్రీంకోర్టు సాధికారిక కమిటీ నివేదిక ఇచ్చింది. ఇప్పుడు వైఎస్ బ్రతికి వుంటే ఈ సిఫార్సుల పట్ల ఎట్లా స్పందించేవాడో వూహించలేము. కానీ రోశయ్య మాత్రం తక్షణం చర్యలు తీసుకొన్నాడు. గాలి జోరుకు బ్రేక్ వేశాడు.

### రోశయ్యకు అంత సీన్ లేదు

అయితే ఇది కేవలం గాలి గనుల దోపిడీని నివారించడానికి చేసిన సత్ప్రయత్నమా లేక జగన్‌కు ముక్కుతాడు వేయడానికి అధిష్టానం చేసిన

**అధిష్టానం దేవతలతో
గట్టిగా మాట్లాడిన జగన్**

తెలివైన ప్రయోగమా అన్నది చర్చ. రోశయ్య సంగతి అందరికీ తెలుసు. ఇంతటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోగల్గిన చేవ, చొరవ ఆయనకు లేవు. కోరి కొరివితో తలగోక్కొనే సాహసం లేదు. అధిష్టానమే ఆయన చేత ఆ ఉత్తర్వులు ఇప్పించిందని చెప్తున్నారు. నూటికి తొంభైపాళ్లు అదే నిజం కావచ్చు.

కొరవ 14వ పేజీలో

# స్మశానంపై కూడా భానుశ్రీ కన్ను!

## ● కలెక్టర్ సైతం పట్టించుకోకుంటే ఎలా?

పత్రికలు తూర్పార బట్టినా, జనం చీకొట్టినా, ప్రతిపక్షాలు ముఖాన ఉమ్మేసినా నెల్లూరు కాంగ్రెస్ నేతలకు బుద్ధి రావడం లేదు. ఇసుక దొంగతనంతో భ్రష్టుపట్టినా, బియ్యం స్మగ్లింగ్‌తో రోత పట్టినా, భూ ఆక్రమణలతో గబ్బు పట్టినా తమ దుర్మార్గాలు మానడం లేదు. కార్పొరేషన్ మేయర్ భానుశ్రీకి ఇదొక ఆటగా మారింది. తానేమీ చేసినా అడ్డుకొనేవారు, అడ్డం చెప్పేవారు లేరన్న అహం కారంతో పేట్రేగి పోతున్నారామె. గత నాలుగైదేళ్లలో ఆమె అక్రమ ఆస్తులు వందకోట్ల రూపాయలు దాటాయని ప్రతిపక్షాలు ఏసిబికి ఫిర్యాదు చేసినా లెక్క చేయడం లేదు. మునిసిపల్ పార్కులు, ప్రభుత్వ స్థానాలు యదేచ్ఛగా ఆక్రమించి భవనాలు కట్టిస్తున్నారు. ఇప్పుడు తాజాగా ముస్లిం స్మశానాన్ని తన ఖాతాలో జమేసుకొన్నారు.


నెల్లూరు రామ్‌నగర్‌లో రిజిస్ట్రేషన్ జరిగిన ముస్లిం సమాధుల తోట.

నెల్లూరు దర్గామిట్ట రామ్‌నగర్‌లో వందేళ్లకు పైపడి ముస్లిం స్మశానం ఒకటి వుంది. వక్ఫ్ ఆస్తుల జాబితాలో దాని వివరం స్పష్టంగా వుంది. అయితే కొందరు ముస్లింలు అది తమ తాతల ఆస్తి అని గత ఇరవై ఏళ్లుగా కోర్టులలో కేసులు నడుపుతున్నారు. అవి అట్లా పెండింగ్‌లో వుండగానే, సినీ నిర్మాత కళ్యాణ్ ఆ స్మశానంలో ఖాళీగా వున్న 350 అంకణాల భాగాన్ని తన పేరిట రిజిష్టర్ చేసుకొన్నారు. అది వక్ఫ్ ఆస్తి కాబట్టి రిజిష్టర్ చేయనని జిల్లా రిజిస్ట్రార్ అభ్యంతరం చెప్పడంతో హైకోర్టుకు వెళ్లి, ఏకపక్షంగా ఉత్తర్వు తెచ్చుకొని మరీ రిజిస్ట్రేషన్

కొరవ 14వ పేజీలో



భూమి పూజ

1258/1 డోర్ నెంబర్ వద్ద, వార్డు నెం.16-3, శ్రీకృష్ణా అవెన్యూ, 2వ మెయిన్‌రోడ్, హరనాథపురం, నెల్లూరు - 3. చిరునామా యందు తేది 27-11-2009, శుక్రవారం, ఉదయం గం.8.28ని.లకు

శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారిచే
ఎమ్.ఎల్.ఏ - నెల్లూరు రూరల్
ముఖ్య అతిథులు
శ్రీమతి ఎన్.భానుశ్రీ గారు
మేయర్ - నెల్లూరు
శ్రీ ఎం.శ్రీధరకృష్ణారెడ్డి గారు
ఎమ్.ఎల్.ఏ - నెల్లూరు సిటీ
గౌరవ అతిథి
శ్రీ ఇరిగేసేని తిరుపతినాయుడు గారు
మాజీ ఎమ్.ఎల్.ఏ, కనిగిరి

DSR Square
Fine living Luxury Apartment

శ్రీ కన్‌స్ట్రక్షన్స్ వారి డి.యస్.ఆర్ స్క్వేర్ భూమి పూజ కార్యక్రమానికి విచ్చేయుచున్న సందర్భముగా అందరికీ ఇదే మా హృదయ పూర్వక ఆహ్వానము

అందరూ ఆహ్వానితులే

Mobiles : 98490 61722, 98480 88188.

Office Address :
SREE CONSTRUCTIONS
Room No. 4, 2nd Floor, Ravula Shopping Arcade, G. T. Road, Opp. Madras Bus Stand, NELLORE - 3. Ph : 0861 - 2329535.

Head Office :
SREE CONSTRUCTIONS
1/C, Heritage Arcade 900 (46/A) S. R. Nagar, Hyd'bad - 38.
E-mail : sreeconstructions09@gmail.com

# జాతీయం చేయాలి

ధన మదంతో విర్రవీగుతుండిన గాలి జనార్ధనరెడ్డికి గట్టి మొట్టికాయ వేసింది సుప్రీంకోర్టు సాధికార కమిటీ. ఆయనకు సంబంధించిన ఐరన్‌ఓర్ గనుల అక్రమాలపై ప్రాథమిక విచారణ జరిపిన కమిటీ ఆ గనులలో త్రవ్వకాలను తక్షణం నిలిపి వేయడంతోపాటు, ఇప్పటికే తవ్విపెట్టిన ఖనిజాన్ని కూడా స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేసింది. అది సిఫార్సు మాత్రమే అని మొదట కొంత వూగిసలాడిన రాష్ట్రప్రభుత్వం, ఆ పాపం తన నెత్తికి చుట్టుకొంటుందని అర్ధమైపోవడంతో గనుల త్రవ్వకాలను నిలిపివేసింది.

గత ఐదారేళ్లుగా గాలి జనార్ధనరెడ్డి ఎంత అరాచకంగా ప్రవర్తిస్తున్నదీ లోకానికి తెలుసు. దివంగత ఆంధ్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అండ చూసుకొని, వేల కోట్ల రూపాయల విలువైన ఇనుప ఖనిజాన్ని కొల్లగొట్టాడు. ఆ డబ్బు తెచ్చిన గర్వంతో ఇటు ఆంధ్ర, అటు కర్నాటక ప్రభుత్వాలను తన గుప్పెట్లో పెట్టు కొని ఆడిస్తున్నాడు. కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్పను తన పాదాల చెంతకు తెచ్చుకొన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో గనుల శాఖ మొత్తాన్ని తన చెప్పుక్రింద తేలు వలె ఆడించాడు. ఆ అండ చూసుకొని నిషిద్ధమని తెలిసీ అటవీ ప్రాంతాలలో లక్షలాది టన్నుల ఖనిజాన్ని త్రవ్వి, అమ్ముకొన్నాడు. ఇరుగుపొరుగు గనులలోకి అక్రమంగా ప్రవేశించి, దౌర్జన్య పూరితంగా వాటిలోని ఖనిజాన్ని కొల్లగొట్టాడు. ఈ ఐదారేళ్లలో ఆయన అక్రమంగా దోపిడీ చేసిన ఇనుప ఖనిజం విలువ పదివేల కోట్లకు పైమాటే అని అంచనా. ఆ డబ్బుతో ఎమ్మెల్యేలను, ముఖ్యమంత్రులను, అధికారులను వశపరచుకొని రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగాడు. తనకు ఎవరూ అడ్డు రాలేరని, తనను ఎదిరించి ఎవరూ నిలవలేరని భ్రమపడ్డాడు. అయితే ప్రభుత్వాలు చేయలేని పని సుప్రీంకోర్టు సాధికార కమిటీ ఒకే ఒక్క నివేదికతో పూర్తి చేసింది.

భారతదేశంలో ఐరన్‌ఓర్, బాక్సైట్, బొగ్గు, మాంగనీసు, టైటానియం వంటి ఖనిజసంపద అపారంగా వుంది. అది ప్రజల సొత్తు. ప్రభుత్వాల అవినీతి, హ్రస్వదృష్టుల ఫలితంగా దేశ ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడవలసిన జాతి సంపద కొందరు వ్యాపారులను కుబేరులను చేయడానికి దుర్వినియోగమౌతున్నది. ఈ దుర్మార్గాన్ని నిలువరించకుంటే ప్రజాస్వామ్యవ్యవస్థకే ప్రమాదమని గాలి జనార్ధనరెడ్డి సోదరులు, జార్ఖండ్ మధుకోడాలు నిరూపించారు. ఇప్పటికైనా ప్రజలు, ప్రభుత్వాలు మేలుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ చేదు అనుభవంతో అయినా దేశంలోని విలువైన ఖనిజ సంపద విషయంలో భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో నిర్ణయించుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద వుంది. ముడి ఖనిజాలను ఎగుమతి చేయడం వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు లభిస్తున్న ఆదాయం నామమాత్రం. అంతర్జాతీయ మార్కెట్లో 3 నుంచి 5వేల రూపాయలకు విక్రయమౌతున్న ఇనుపఖనిజం మీద ప్రభుత్వానికి లభిస్తున్న రాయల్టీ కేవలం 150 రూపాయలు మాత్రమే. అదే ఖనిజాన్ని మన దేశంలోనే పరిశ్రమల ద్వారా ఉక్కుగా మార్చి ఎగుమతి చేస్తే దేశానికి వేల కోట్ల రూపాయల రాబడి వస్తుంది. లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుంది.

నిజానికి ఐరన్‌ఓర్, బాక్సైట్ వంటి ఖనిజాలు చైనా, అమెరికా వంటి దేశాలలో మన కంటే ఎక్కువ వున్నాయి. కానీ వారు వాటిని త్రవ్వడం లేదు. మన దేశం నుంచి దిగుమతి చేసుకొంటున్నారు. దాని అర్థం మన దేశంలో ఆ వనరులు ఖాళీ అయిన తర్వాత, ఇక్కడి ఉక్కు పరిశ్రమలు మూతపడిన తర్వాత, అధికధరలకు అదే ఉక్కును మనకు అమ్మి లాభపడాలన్నది వారి ఆలోచన. ఎప్పుడో యాభైఏళ్ల తర్వాత ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశాలు అనుసరిస్తున్న ప్రణాళిక మనకు లేకపోవడం మన పాలకుల చేతకాని తనానికి రుజువు. గాలి జనార్ధనరెడ్డి అనుభవంతో అయినా ప్రభుత్వాలు కళ్లు తెరిచి, ఈ గనులన్నిటినీ జాతీయం చేయడం దేశభవిష్యత్తుకు ఎంతో అవసరం. ప్రపంచ ప్రసిద్ధ ఆర్థికవేత్తగా గుర్తింపు పొందిన మన ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఈ కోణంలో నిర్ణయం తీసుకొంటే, భావితరాల వారు ఆయన్ను దేముడిగా కొలుస్తారు. దేశానికి ఎంతో మేలు చేసిన వాడౌతాడు.

## జనవాణి

### దారిద్ర్యరేఖ దిగువన వున్నవారికే ఆరోగ్యశ్రీ!

రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తుల వార్షిక ఆదాయాలను పరిగణలోనికి తీసుకోకుండా తెల్లకార్డులు, వాటికి తోడుగా ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేసింది. తెల్ల కార్డులను తీసుకొని రేషన్‌షాపులకు వెళ్లేవారు లేకపోయినా ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకొని ఆస్పత్రులకు వెళ్లేవారు కోకొల్లలుగా వున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేతో ప్రయోజనం లేదు. వాస్తవానికి దారిద్ర్యరేఖ దిగువన వున్నవారే తెల్లకార్డులతోపాటు ఆరోగ్యశ్రీ కార్డులు పొందేందుకు అర్హులు. ఆ వైపుగా ప్రభుత్వం సర్వే చేస్తే ఖజానాకు మిగులు, అర్హులకు మేలు జరుగుతుంది.

ఆలూరు ఆత్మానందం, నెల్లూరు.

### పోలీసులకు అధికారం లేదు

టీవీల్లో, పత్రికల్లో చూస్తుంటాము. పేకాట క్లబ్బులు, కోడిపందేలపై పోలీసులు దాడి చేశారని కొంతమందిని అరెస్టు చేయడంతో పాటు కొంత డబ్బు స్వాధీనం చేసుకొన్నామంటారు. అంతవరకైతే బాగుంది. వారి సెల్‌ఫోన్లు, మోటారు బైకులు సీజ్ చేశామంటారు. అవి ఎందుకు చేస్తారో తెలియదు. ఇలా చేసే అధికారం పోలీసులకు లేదు. సామాన్యులకు ఈ విషయం తెలియక గమ్ము నుండి పోతున్నారు.

టి.కోటేశ్వరరావు, కోవూరు.

### మంచి నిర్ణయం

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు గత 18ఏళ్లుగా మండల రిసోర్స్‌పర్సన్స్, ఎంఎల్ఓలుగా జిల్లా సాక్షరతా సమితిలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. దీని మూలంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత విద్యాబోధనకు ఆటంకంగా మారింది. ఈ విషయాన్ని ఆలస్యంగానైనా విద్యాశాఖ గుర్తించి ఈ డిప్యూటేషన్ రద్దు చేస్తూ పూర్వపువిధుల్లో చేరమని ఇచ్చిన ఉత్తర్వులు హర్షనీయం.

గడ్డం తిరుపాలురెడ్డి, మహమ్మదాపురం.

### నైతిక విలువలు కోల్పోయిన బిజెపి!

క్రమశిక్షణకు, నైతిక విలువలకు మారుపేరుగా నిలచిన భారతీయ

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

1-12-1939
పేజీలు : 16 వెల: అణా

### నవాబుపేట దేముడికి పంగనామాలు!

నెల్లూరు నవాబుపేట మల్లేశ్వరస్వామి వారి తాలుకు చిన్నచెరుకూరు గ్రామంలో 90ఎకరాల మాగాణి వున్నది. దేవాలయ ట్రస్టీలు ఈ భూములను మక్తాలకు ఇవ్వడంలో పది మందిలో బహిరంగంగా పాట పెట్టి ఇవ్వక రహస్యంగా యిస్తున్నందున దేముడికి వరుమానం తగ్గుతున్నది. ట్రస్టీలు యివి స్వంత భూములనుకొన్నారేమో? అది పొరపాటే! అట్లా అనుకుంటే మక్తాలు హెచ్చించుకోక తగ్గించుకుంటారా?

ఇట్లు, కథ ఎరిగినవాడు

### కుడితిపాళెం వార్తలు

మా గ్రామంలో పాఠశాలలేని కొరతను తీర్చుటకు అభినవ కుబేరులు టంగుటూరు రామిరెడ్డిగారు వారి పుత్రులు లక్ష్మీనరసారెడ్డి గారలు ఉదార హృదయంతో గ్రామస్తుల నిమిత్తం, తమ స్వంత స్థలంలో అయిదంకణాల భవనాన్ని కట్టించి దానిలో విజయదశమినాడు పాఠశాలను స్థాపించి పౌరుల కృతజ్ఞతకు పాత్రులైనారు.

### ఇందుపూరు సభ

తే 23-11-39 ది ఇందుపూరులో కొనగళ్ల శేషాచలం గారి అధ్యక్షతన సభ జరిగింది. టి.శంకరయ్య గారు ప్రస్తుత పరిస్థితులను గూర్చి మాట్లాడారు. అనేక సంవత్సరాల నుంచి ఇందుపూరుకు పంచాయితీ బోర్డు కావలెనని కోరుచున్నాము. యింతవరకు ఏర్పరచనందుకు పంచాయితీ ఆఫీసరు గారి చర్యలపై అసమ్మతి తెలియజేయుచు వెంటనే ఏర్పడవలెనని లోకలు బోర్డు యినస్పెక్టరు గారిని, నెల్లూరు జిల్లా బోర్డు అధ్యక్షులు గారిని కోరుచూ సభవారు తీర్మానించారు.

– ఒక విలేఖరి

## 50 ఏళ్ల క్రితం ఈవారం

27-11-1959
పేజీలు: 12 వెల: 0-3-0

### హైదరాబాదు వార్తలు

#### శాసనసభా సమావేశాలు

ఆంధ్ర శాసనసభ సమావేశం డిశంబరు 7తేదీ సాయంత్రం 4గంటలకు ప్రారంభమవుతుంది. కౌన్సిల్ 14తేది సమావేశమౌతుంది.

#### క్రొత్త నాయకుని ఎన్నిక

శ్రీ నీలం సంజీవరెడ్డి గారు అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షతను స్వీకరిస్తున్నందున వారి బదులు శాసనసభ కాంగ్రెస్ పార్టీ నాయకుని ఎన్నిక డిశంబరు 30తేది జరుగుతుందట.

#### శాసనసభ్యత్వాన్ని వదలుకోరు

కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైనా సంజీవరెడ్డిగారు శాసనసభ్యత్వాన్ని మాత్రం వదలుకోరట. ఇచ్చుటుండి మంత్రివర్గానికి సలహాలిస్తుంటారట.

#### ఏడేళ్లలో నూరుకోట్లు పెరిగిన రక్షణ వ్యయం

1938-39లో అవిభాజ్య భారతదేశ రక్షణవ్యయం 46కోట్ల 18లక్షలు. అది 19-1-52 నుంచి పెరుగుతూ (అప్పటి వ్యయం 170 కోట్ల 96లక్షలు) నేడు (1958-59) 266కోట్ల 88 లక్షలకు చేరింది. ఇది ఒక్క భారతదేశానికి మాత్రమే. చైనా సరిహద్దు దురాక్రమణ వగైరాల వల్ల ఈ వ్యయం మరింత పెరిగిపోవచ్చునని వూహిస్తున్నారు. ఈ పెరుగుదల యిట్లనే వుంటే, మన ప్రణాళికల ప్రగతి కుంటుబడక తప్పదు.

#### పావలా కొక బిడ్డ

కేరళలో అచ్చటచ్చట, కడకు రాష్ట్ర రాజధానియైన తిరువేంద్రంలో గూడా కన్న బిడ్డలను గంజినీళ్లకు అమ్ముకుంటున్న దురదృష్టకర సంఘటనలు అనేకం వినబడుతున్నది.

# నెల్లూరు ముచ్చట్లు
విశ్లేషకుడు

## ప్రతిరోజూ వర్షం

గత వారం రోజులుగా ప్రతిదినం ఏదో ఒక సమయంలో నెల్లూరు నగరంలో వర్షం పడుతూనే వుంది. 21, 22, 23, 24 తేదీల్లోనూ వర్షం పడింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు అయ్యప్ప గుడి నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు ట్రంకురోడ్డు సెలయేరును తలపిస్తుంది. వర్షానికి చాలా చోట్ల రోడ్డు దెబ్బతినేసింది. వన్‌టౌన్ ప్రాంతంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. పాలకులు, అధికారులకు ఈ వ్యవహారాలేవీ పట్టడం లేదు.

## గ్రేటర్ ఎన్నికలకు నెల్లూరు నాయకులు!

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌కు 23వ తేది జరిగిన ఎన్నికల ప్రచారంలో నెల్లూరు ముఖ్యనేతలంతా పాల్గొన్నారు. మునిసిపల్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా పనిచేశారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు బల్లి దుర్గాప్రసాద్, పరసా రత్నం, కురుగొండ్ల రామకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు బీద రవిచంద్ర ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. ఆనం వివేకానంద రెడ్డి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. పోలింగ్ రోజు జరిగిన గొడవల్లో తాళ్లపాక రమేష్‌రెడ్డి సైతం టీవీల్లో కనపడ్డారు. ఎన్నికల బందోబస్తుకు జిల్లా నుంచి 763 మంది పోలీసులు వెళ్లారు. ఫలితాలొచ్చాక మనోళ్ల ప్రచార ఘనతను చర్చిద్దాం.

**అమ్మ ఫర్నిచర్స్**
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్.
రాఘవ సినీకాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435686, 9849495685

## నెల్లూరులో రేషన్‌కార్డుల సర్వే!

నెల్లూరు నగరంలో రేషన్‌కార్డుల సర్వే 25వ తేది ప్రారంభమయ్యింది. దీనికోసం 130 సర్వే బృందాలను నియమించారు. నగరంలో లక్షా 53వేల మందికి కార్డులుండగా వీటిలో 1, 18, 778 తెల్లకార్డులు. చిరునామాలు మారి వుండే కార్డుదారులు పాత ప్రాంతాలకు వెళ్లి అక్కడి సర్వే బృందాలకు కార్డులు చూపించి సరిచేసుకోమంటున్నారు జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్.

## విజిలెన్స్‌కు కొత్త ఎస్పీ!

నెల్లూరు డివిజన్ విజిలెన్స్ ఎస్పీగా కె.వి.మోహన్‌రావు 21వ తేది బాధ్యతలు తీసుకొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న పాల్‌రాజ్‌ను తిరుపతికి బదలీ చేశారు. మోహన్‌రావు స్వస్థలం గుంటూరు. 2008లో డిఎస్పీగా పోలీస్ శాఖలో చేరిన ఆయన కొత్తగూడెం, కామారెడ్డి, గుంతకల్‌లలో పనిచేశారు. 2007లో ఎఎస్పీగా పదోన్నతి లభించిన మోహన్‌రావు విశాఖపట్నంలో పనిచేస్తూ ఎస్పీగా మరో పదోన్నతిపై నెల్లూరుకు వచ్చారు. 22వ తేది ఎస్పీ మల్లారెడ్డిని కలసి సహకారం కోరిన మోహన్‌రావు జిల్లాలో పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసుకొని అడుగు ముందుకు వేస్తానన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో బ్యాగుల దొంగలు!

హస్తలాఘవం చూపి చోరీలు చేసేవారు నగరంలో ఎక్కువయ్యారు. 21వ తేది రాత్రి లక్షా 70వేలు బ్యాగులో పెట్టుకొని కావలి వెళ్లను నెల్లూరు ఆర్టీసి మెయిన్ బస్‌స్టేషన్‌కు వచ్చిన రిటైర్డ్ డిఎస్పీ శ్రీనివాసరావు బ్యాగును ఖాజావలి అనే దొంగ కత్తిరించాడు. ఈ వ్యవహారాన్ని బస్టాండ్‌లోని ఓ ప్రయాణీకుడు చూసి అవుట్ పోస్టులోని కానిస్టేబుల్‌కు చెప్పడంతో దొంగను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఇక్కడే వుండిన మరో దొంగ సత్యం పరారయ్యాడు. పట్టుబడిన ఖాజావలిది ఒంగోలు ఇస్లాంపేటని పోలీసుల విచారణలో తేలింది. దీన్నిబట్టి అర్థం చేసుకోవాల్సిందేమిటంటే ఆర్టీసి బస్టాండుకు వెళ్లిన సమయంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలి. లేకుంటే అసలుకే ఎసరు ఖాయం.

**చందాదారులకు మనవి**

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చెక్కులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరు తున్నాము.

**జీవిత చందా రూ.1000/-**

**సంవత్సర చందా**
స్వదేశంలో రూ.200/-
విదేశాలకు రూ.1000/-

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

## పైరేటెడ్ సిడిల పట్టివేత

నెల్లూరు నగరం పైరేటెడ్ సిడిల అమ్మక కేంద్రంగా తయారయ్యింది. చెన్నై, విజయవాడ, హైదరాబాద్ నుంచి తెప్పించిన కొత్త సినిమా సిడిలకు ఇక్కడ నకిలీవి తయారుచేసి ఒక్కొక్కటి 20 రూపాయల చొప్పున అమ్మేస్తుంటారు. యుగాంతం 2012, బంపర్ ఆఫర్, మగధీర చిత్రాలతో పాటు నీలి చిత్రాలకు సంబంధించిన 600 సిడిలను ఆనం వారి వీధిలోని చిన్నబ్బాయి వీడియో క్యాసెట్ల షాపులో పట్టణ సిఐ వీరాంజనేయరెడ్డి 22వ తేది దాడిచేసి పట్టుకొన్నారు. రెండు వారాల క్రితం ఇక్కడ నగర డిఎస్పీ రాధిక దాడులు చేసినా ఈ షాపు యజమాని ఈ పైరేటెడ్ సిడిల వ్యాపారాన్ని మానడం లేదు.

## అర్బన్ మండలం ఏర్పాటుకు నో!

నెల్లూరు నగరం, రూరల్ ప్రాంతానికి ఒక్కటే రెవిన్యూ కార్యాలయం వుండడంతో ఎమ్మార్వోగా ఇక్కడ పనిచేసే అధికారికి, సిబ్బందికి, పనిబడ్డ ప్రజలకు ఇబ్బందిగా వున్న సంగతి తెలిసిందే. ఈ ప్రతిష్టంబనను తొలగించను నెల్లూరు అర్బన్ మండల ఏర్పాటు ప్రతిపాదనను జిల్లాఅధికారులు రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి పంపారు. కానీ ఆర్థిక శాఖ ప్రస్తుతమున్న ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో కొత్త కార్యాలయ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. దీనివల్ల మరికొన్నాళ్ళు నెల్లూరు ఎమ్మార్వో కార్యాలయానికి పనిబడి పోయే వారికి తిప్పలు తప్పవు.

## చెరకుకు మద్దతు ధర ఇవ్వండి!

జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలు చెరకు పండించే రైతులకు గిట్టుబాటు ధరలిచ్చేలా కలెక్టర్ తగినచర్యలు తీసుకోవాలని ఆయన్ను 23వ తేది కలసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు కోరారు. టన్నుకు 2500 రూపాయల గిట్టుబాటు ధర ఇవ్వకుంటే భవిష్యత్తులో చెరకు పండించే వారే లేకుండా పోతారని సంఘం జిల్లా కార్యదర్శి చండ్ర రాజగోపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

## జర్నలిస్టు కుటుంబాలకు సాయంపై హామీ!

ఇటీవల అనారోగ్యంపాలై మరణించిన చిట్టగుంట ఆంధ్రజ్యోతి విలే

కొరవ 14వ పేజీలో

**బంగారం స్పెషల్ ఆఫర్**
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
**గోల్డ్ ప్యాలెస్**
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611



# ప్రథమ వర్ధంతి

మా అభివృద్ధికి మార్గదర్శి
మానవతా విలువలు కలిగిన మహోన్నత శక్తి
**శ్రీ కాకాణి రమణారెడ్డి** గారి
ప్రధమ వర్ధంతి సందర్భంగా
వారిని స్మరించుకుంటూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

స్వర్గీయ **కాకాణి రమణారెడ్డి** గారు
బెంగుళూరు

**కుటుంబ సభ్యులు**

● ఆల్వారీగడ్డ పిండి కారణం

## పుల్కా తిని ప్రాణం మీదకు తెచ్చుకొంటున్నారు



తోపుడుబండ్లపై యమజోరుగా తయారవుతున్న పుల్కాలు.

ఈ మధ్య నగరంలోని ప్రజలు రాత్రివేళ భోజనం మాని రెండు పుల్కాలు తిని పడుకోవడం అలవాటుగా చేసుకొన్నారు. వాస్తవానికి ఆరోగ్యానికి రెండు పుల్కాలు తిని పడుకోవడం చాలా మంచిదే. వీటిని ఇంట్లో గోధుమపిండితో చేసుకొని నూనె లేకుండా పెనం మీద కాల్చుకుని తినడం కన్నా ఉత్తమం మరొకటి లేదు. కానీ ప్రస్తుతం అది జరగడం లేదు. ఇళ్లలో వీటిని చేసే ఓపిక లేకపోవడం వల్ల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బండ్లపై నిప్పులపై పెట్టి కాల్చే పుల్కాలు, పేరుగాంచిన హోటళ్లలో అమ్ముతున్న పుల్కాలను జనం పార్శిల్ చేయించుకొని వెళ్తున్నారు. కానీ బయట అమ్మే పుల్కాలలో గోధుమపిండి తక్కువగా వాడి, ఆల్వారీగడ్డ పిండి ఎక్కువగా వాడేస్తున్నారు. ఈవిధంగా చేసిన పుల్కాలు రుచిగా, మెత్తగా వుండడంతో జనానికి వీటిని మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. వాస్తవానికి ఆల్వారీ గడ్డలో పిండి పదార్థం ఎక్కువగా వుంటుంది. పుల్కాలోకి ఇచ్చే కూరతో కలుపుకు తింటే మామూలుగా తినే ఆహారంకన్నా ఎక్కువ కేలరీలు అవుతాయని, షుగర్ వ్యాధిగ్రస్తులు తెలియకుండా ప్రాణాల మీదకు తెచ్చుకొన్నట్లేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి బయట పుల్కాలు తినేవాళ్లు ఆ అలవాటు మానుకోవడం ఉత్తమమని మా సలహా.



సిఎం రోశయ్యను హైదరాబాదులో కలిసి వినతిపత్రం ఇస్తున్న నెల్లూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు.

● ఆర్యవైశ్య సంఘం వాదన

## వేమాలశెట్టి బావి సత్రం మాదే!

నెల్లూరు దర్గామిట్టలోని వేమాలశెట్టి బావి సత్రం స్థలంపై ఆర్యవైశ్యులకే అధికారం వుందని నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నేతలు చెబుతున్నారు. 1949 సంవత్సరంలో అప్పటి జిల్లా జడ్జి ఈ స్థలం ఆర్యవైశ్యులదని గుర్తించి దీనికి ట్రస్టీలుగా ఆర్యవైశ్యులనే నియమించారన్నారు. 1970లో నెల్లూరు మునిసిపాలిటీ పరిధిలో వుండే ఆర్యవైశ్యులనే ట్రస్టీలుగా నియమించడం జరిగిందంటున్నారు. 1949 నుంచి ఇది ఆర్యవైశ్యుల సత్రం, బావిగా గుర్తించబడింది. ఇదే విషయాన్ని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు 17వ తేదీ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలసి పక్కా డాక్యుమెంట్లు, ఆధారాలు చూపించామని, ఆయన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి గాదె వెంకటరెడ్డిని కలసి వివరాలు తెలుపమనగా అన్ని వివరాలు సమర్పించామన్నారు. ఇక్కడ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నిర్మిస్తామని ఈ విషయమై నెల్లూరు ప్రజలు ఆర్యవైశ్యులకు సహకరించాలంటున్నారు సంఘం కోశాధికారి రాజా నరసింహారావు.

● ఇసుక క్వారీల ఆదాయం పోయిందని ఆవేదన

## జడ్పీ ఛైర్మన్ కస్సు బుస్సు!



జిల్లాలోని ఇసుక క్వారీలపై సమగ్ర సర్వే నిర్వహించి తద్వారా జిల్లా పరిషత్‌కు అవసరమైన నిధులు సమకూర్చడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. జడ్పీ మీటింగ్ హాల్‌లో గనులు, భూగర్భ జలశాఖ, మత్స్యశాఖ, అటవీశాఖ స్థాయి సంఘ సమావేశంలో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక రీచ్‌లపై గనులు, భూగర్భ శాఖాధికారులు సమగ్ర సర్వే నిర్వహించక పోవడం వల్ల 17 కోట్లు జడ్పీ ఆదాయం నష్టపోయింది. కోర్టులో పెండింగ్‌లో వున్న 17 రీచ్‌లపైనా చర్యలు తీసుకోవడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఇసుక రీచ్‌ల గుర్తింపుపై తీసుకొంటున్న చర్యలకు సంబంధించి నివేదికలు జడ్పీకి అందజేయాలన్నారు. జడ్పీ ఛైర్మన్ ఎంత వెంటపడుతున్నా ఇసుక రీచ్‌లలో దోపిడీ ఆగడం లేదు. అదే విచారకరం.

## పెళ్లి బృందంపై మృత్యు పంజా!

● చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో గాలిలో కలిసిన ప్రాణాలు

22వ తేదీ అర్ధరాత్రి తిరుమలలో పెళ్లి చేసుకొని క్వాలిస్‌లో గుంటూరు జిల్లాకు తిరిగి వెళ్తున్న పెళ్లి బృందంపై మృత్యువు పంజా విసిరింది. చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆగి వున్న లారీని క్వాలిస్ ఢీకొనడంతో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. వినుకొండకు చెందిన వేణుగోపాల్‌కు బెంగుళూరు వాసి మధులతతో 21వ తేదీ తిరుమలలో వివాహమైంది. ఆదివారం వీరంతా తిరుగు పయనమయ్యారు. క్వాలిస్‌లో పెళ్లి కుమారుని తల్లితండ్రులు, సోదరుడు, బంధువులు పయనిస్తుండగా, వీరి వెనుక టెంపోలో నూతన దంపతులు, మరికొంతమంది బంధువులున్నారు. క్వాలిస్ నెల్లూరు చింతారెడ్డిపాళెం రోడ్డు వద్దకు రాగానే జోరు వర్షంలో రోడ్డు ప్రక్కన ఆగివున్న లారీని ఢీకొట్టింది. దీంతో పెళ్లి కొడుకు తల్లితండ్రులు ఆంజనేయులు, పుష్పావతి, తమ్ముడు శ్రీకాంత్, అమ్మమ్మ ఆదెమ్మ బాబాయ్ రమేష్, పెద్దమ్మ, పెదనాన్న ఆత్మకూరు సుబ్బరత్నం, రామకోటేశ్వరరావు, డ్రైవర్ భాస్కర్‌నాయుడు, మరో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. రోడ్డు కాస్త డౌన్‌గా వుండడంతో ఈ ప్రాంతంలో అకస్మాత్తుగా వాహనాలు వేగాన్ని అందుకొంటాయి. ఈ దశలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెళ్లి కుమారుడి బంధువులంతా దుర్మరణం చెందడంతో అతని బాధ చూసే వారిని సైతం కంటతడి పెట్టించింది. విధి ఎంత బలీయమైనదన్న విషయం ఈ రోడ్డు ప్రమాదంతో మరోసారి లోకానికి వెల్లడయ్యింది.



నెల్లూరు పెద్దాసుపత్రి మార్చురీలో రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి శవాలు.

● ఆకట్టుకొంది

## అమ్మ ఫర్నిచర్ ప్రదర్శన!



చూడచక్కని విదేశీ సోఫాలు

నెల్లూరు ఇందిరాభవన్‌లో అమ్మ ఫర్నిచర్స్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మరియు సేల్స్ అందరినీ ఆకట్టుకొంటుంది. మలేషియా, తైవాన్, బ్యాంకాక్, ఇండోనేషియా దేశాల నుంచి దిగుమతి చేస్తున్న సోఫాసెట్స్, డబుల్ కాట్స్, గార్డెన్ డైనింగ్ టేబుల్స్, గ్రాండ్ ఫాదర్ క్లాక్, ఎక్వైరియం ఉత్పత్తులు కొనుగోలుదారుల మనసులు దోస్తున్నాయి.

ఆకట్టుకొనే రకాలు అందుబాటు ధరలలో దొరుకుతుండడంతో ఈ ప్రదర్శనకు విశేషస్పందన లభిస్తుంది. ఈ సేల్‌లో ప్రతి కొనుగోలుపై ఒక గిఫ్ట్ హ్యాంపర్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు అమ్మ ఫర్నిచర్ అధినేత గద్దం సుధాకర్‌రెడ్డి తెలిపారు. కొనకూడదని వెళ్లిన వారు సైతం ఏదో ఒక వస్తువు కొనేలా ఈ ప్రదర్శన చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

మనసును దోచే ఫర్నిచర్.



● అమెరికన్ ఆస్పత్రిలో

# వివాదాల నెగడు!

**112 ఏళ్ల చరిత్ర కల్గిన నెల్లూరు అమెరికన్ ఆస్పత్రి మూతబడినప్పుడు తెరిపించే ప్రయత్నం చేయని ప్రాపర్టీస్ అసోసియేషన్ ఆఫ్ అమెరికన్ బాప్టిస్ట్ క్రిస్టియన్ సంస్థ ఇప్పుడీ ఆస్తులు తమవనడం విచిత్రంగా వుంది.**



మూతబడిన నెల్లూరు అమెరికన్ ఆస్పత్రి.

జిల్లాలో చారిత్రాత్మకమైన అమెరికన్ బాప్టిస్టు క్రిస్టియన్ హాస్పిటల్ వివాదాల వూబిలో చిక్కుకుంది. 112 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ ఆసుపత్రి కొంతమంది స్వార్థపరుల కారణంగా మూతపడిపోయింది. జిల్లా ప్రభుత్వాసుపత్రి తర్వాత పేదలకు వైద్య చికిత్సలు నిర్వహించిన ఘనత ఈ ఆసుపత్రికే దక్కుతుంది. ఆసుపత్రి మూతపడడంతో ఇక్కడ పనిచేసే డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బందికి జీవనాధారం లేకుండా పోవడంతోపాటు వీరికి చెల్లించాల్సిన జీతభత్యాలు, ప్రావిడెంట్‌ఫండ్ కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయి. అమెరికన్ క్రిస్టియన్ సంస్థ పేదలకు వైద్యం, విద్య, ఇతర సదుపాయాలు కల్పించాలన్న సంకల్పంతో మన దేశంలో వివిధ సంస్థలను ఏర్పాటు చేయడం జరిగింది.



ఆస్తికి అసలు హక్కుదారులు పెట్టిన బోర్డులు.

## స్వార్థపరుల ప్రవేశం

బాప్టిస్టు క్రిస్టియన్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంస్థలు కొంతమంది స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లడంతో కోట్ల రూపాయలు విలువచేసే ఆస్తులు, స్థలాలు దుర్వినియోగం జరిగాయి. నెల్లూరు నగరంలోని సిఎఎంహైస్కూలు, సుబేదారుపేటలోని ఎబిఎం బాలికలహైస్కూలు, కావలిలోని ఎబిఎం జూనియర్ కళాశాల, ప్రాథమిక పాఠశాల వుండే ఆస్తులన్నీ కూడా బాప్టిస్టు క్రిస్టియన్ సంస్థకు చెందినవే. ప్రస్తుతం సిఎఎంహైస్కూల్ ఆవరణలో ఖాళీస్థలాలు, సుబేదారుపేటలోని ఎబిఎం హైస్కూల్ ఆవరణలోని ఖాళీస్థలాలు, కావలిలో మరికొన్ని క్రిస్టియన్ సంస్థకు చెందిన స్థలాలు విక్రయం జరిగిపోయాయి. కోట్లరూపాయలు చేతులు మారాయి.

ఇటీవల అమెరికన్ హాస్పిటల్‌కు సంబంధించిన స్థలాలు విక్రయాలు జరిగాయి. ఆసుపత్రికి చెందిన స్థలాలను విక్రయించి వచ్చిన నగదుతో సిబ్బందికి జీతభత్యాలు, విద్యుత్ బకాయిలు చెల్లించాలన్న వుద్దేశంతో వీటిని విక్రయించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. అమెరికన్ ఆసుపత్రితో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు స్థలం విక్రయం జరిగిన తర్వాత రంగప్రవేశం చేసి ఆస్తుల విక్రయం చెల్లదంటూ ఆందోళన చేసిన విషయం అందరికీ తెలిసిందే. చట్టపరంగానే స్థల విక్రయాలు జరిగినట్లు రికార్డులు చెబుతున్నా ఆందోళనలు చేయడం పట్ల ఆసుపత్రి పరువు మరింత దిగజారిపోయింది.

## గతమెంతో ఘనం!

112 సంవత్సరాల క్రితం సేవాభావంతో ఏర్పాటుచేసిన అమెరికన్ క్రిస్టియన్ హాస్పిటల్ గురించి ప్రస్తుత తరం వారికి తెలియకపోవచ్చు. ఈ ఆసుపత్రిలో చికిత్స పొందినవారు, పురుడు పోసుకున్నవారిని కదిలిస్తే చాలు ఆసుపత్రి గురించి ఎంతో గొప్పగా చెబుతారు. 1895వ సంవత్సరంలో రెవ.డేవిడ్ డౌని అనే అమెరికన్ ఈ స్థలాన్ని కొనుగోలుచేసి విదేశీయులు అందజేసిన విరాళాలతో ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. దాదాపు రెండుసంవత్సరాలపాటు నిర్మాణం జరిగింది. 1897 ఫిబ్రవరి 10వతేది ఆసుపత్రి ప్రారంభించగా, వైద్య సేవల్ని అప్పటి జిల్లాకలెక్టర్ డబ్ల్యు.ఎస్. మేయర్ ప్రారంభించడం జరిగింది.

తొలుత బాప్టిస్టు క్రిస్టియన్ హాస్పిటల్‌లో స్త్రీలకు మాత్రమే వైద్యసేవలు అందించేవారు. 1960వ సంవత్సరంలో జనరల్ హాస్పిటల్‌గా మార్పు చేసి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. అమెరికన్‌లతోపాటు మన జిల్లాకు చెందిన స్వర్గీయ తిక్కవరపు రామిరెడ్డి, రావుబహదూర్ రేబాల లక్ష్మి నరసారెడ్డిలతోపాటు మరికొందరు దాతలు విరాళాలు అందించి బాప్టిస్టు క్రిస్టియన్ హాస్పిటల్ అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించిన ఘనత వుంది. ఈ ఆసుపత్రిలో ఎంతోమంది పేదలకు వైద్య సేవలు అందించినవారున్నారు. డాక్టర్ మెరియన్ ఒబేర్ ఇదే ఆసుపత్రిలో దాదాపు 38 సంవత్సరాలపాటు సూపరింటెండెంట్‌గా కొనసాగారు.

## బేరమ్మ సేవలు ఘనం

1953వ సంవత్సరంలో భారతదేశానికి వచ్చిన ఆమె తొలుత ప్రకాశంజిల్లా రామాయపట్నంలో తెలుగు నేర్చుకొని ఒంగోలు పట్టణంలో వైద్యసేవలు ప్రారంభించారు. అనంతరం 1954 సంవత్సరంలో నెల్లూరు బాప్టిస్టు క్రిస్టియన్ హాస్పిటల్‌కు చేరి 1991 సంవత్సరం వరకు దాదాపు 38 సంవత్సరాలపాటు జిల్లా ప్రజలకు నిరాటకంగా వైద్యసేవలు అందించారు. ఆమెను ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో బేరమ్మగా పిలుస్తుంటారు. ఒక డాక్టర్‌గానే కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ ధనిక, పేద అనే తేడా లేకుండా నిస్వార్థంగా సేవలు అందించారు. బి.సి ఆసుపత్రిని అంచెలంచెలుగా అభివృద్ధిచేసి శిఖరాగ్రస్థాయికి తీసుకెళ్లారు.

ఈమె ఆధ్వర్యంలో దాదాపు 36వేల శస్త్రచికిత్సలు జరిగాయి. సేవాభావంతో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందించి జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఘనత డాక్టర్ బేరమ్మకే దక్కుతుందని చెప్పాలి. నెల్లూరును ప్రధాన కేంద్రంగా చేసుకొని వారంలో ఒక రోజు డాక్టర్ బేరమ్మ ఆధ్వర్యంలో పనిచేసే వైద్యబృందం గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వైద్య శిబిరాలను నిర్వహించేది. ఈదగాలి, ఉదయగిరి, అల్లూరు, బోగోలు, కావలి తదితర ప్రాంతాలలో వైద్యశిబిరాలు జరిగాయి.

## 1991 తర్వాత...

డాక్టర్ బేరమ్మ ఇక్కడ నుంచి అమెరికా వెళ్లిన తర్వాత బాప్టిస్టు క్రిస్టియన్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ దేవరాజ్ వూలా బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏ ముహూర్తాన బాధ్యతలు తీసుకొన్నారో తెలియదుగాని, ఆనాటి నుంచి ఆసుపత్రి పతనానికి దారి తీసింది. ఆసుపత్రిలో సక్రమంగా విధులు నిర్వహించకపోవడం, సేవాభావం విడనాడి వ్యాపార దృక్పథంవైపు పయనించడం, నిధుల దుర్వినియోగానికి పాల్పడడం వంటి సంఘటనలతో, ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా తగ్గిపోయింది.

ఆసుపత్రినే నమ్ముకొని పనిచేసే సిబ్బందికి జీతభత్యాలు చెల్లించడం కూడా మానేశాడు దేవరాజ్ వూలా. ఇంతేకాకుండా ఆసుపత్రికి సంబంధించిన వాహనాలు విక్రయాలు జరిగిపోయాయి. ఎంతో చరిత్ర కలిగి వంద సంవత్సరాలు పూర్తి చేసుకొన్న ఈ ఆసుపత్రి 2003 సంవత్సరంలో శాశ్వతంగా మూతపడిపోయింది. ఆనాటి నుంచి నేటివరకు ఆసుపత్రిలో పని చేసిన సిబ్బంది తమకు చెల్లించాల్సిన జీతభత్యాలు కోసం తిరగని కార్యాలయం, కలవని ప్రజాప్రతినిధులు లేరు. అయినా కూడా వీరికి ఇప్పటికీ న్యాయం జరగలేదు. ఆసుపత్రి మూతపడే సమయంలో రాని క్రిస్టియన్ సంస్థ నిర్వాహకులు ఆస్తులు విక్రయం జరిగిన తర్వాత వచ్చి ఆందోళన చేయడం పట్ల అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

బాప్టిస్టు క్రిస్టియన్ ఆసుపత్రికి సంబంధించిన 2ఎకరాల 50సెంట్లను నగరానికి చెందిన సరయు ఆటోమొబైల్స్ అధినేతలు రాజ్‌కుమార్, దిలీప్‌కుమార్ కోటి 50లక్షలకు కొనుగోలు చేయడం జరిగింది. ఈ ఆస్తులను బాప్టిస్టు క్రిస్టియన్ సంస్థకు చెందిన నిర్వాహకుల నుంచి కొనుగోలుచేసినట్లువారు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వున్న బాప్టిస్టు క్రిస్టియన్ ఆస్తులను విక్రయించే అధికారం అస్సాం రాష్ట్రంలో వున్న ఇమోజండ్ అయ్యర్‌కు వుందని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. ఈయన ద్వారా పవర్ పట్టాపొందిన వారే సరయు అధినేతలకు స్థలాన్ని విక్రయించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే ప్రాపర్టీస్ ఆఫ్ అమెరికన్ క్రిస్టియన్ ప్రతినిధినంటూ కావలికి చెందిన దివాకర్ అనే పాస్టర్ ఆందోళనకు దిగారు.

## దివాకర్‌కు అధికారం లేదు!

దివాకర్‌కు స్థలాలను విక్రయించే అధికారం లేదు. అయినప్పటికి ఈయన చేసే ఆందోళన వెనుక స్వార్థం కనిపిస్తుందని సంస్థ ప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆసుపత్రి మూతపడిన నాటి నుంచి ఇప్పటివరకు పత్తాలేని దివాకర్ అకస్మాత్తుగా కొంతమంది జనాన్ని వెంటబెట్టుకొనివచ్చి ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం సృష్టించడం, అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను తరిమివేయడం జరిగింది. కోట్లరూపాయల విలువ చేసే క్రిస్టియన్ ఆస్తులు విక్రయాలు జరగడం వెనుక దివాకర్ ప్రమేయం వుందని వాదన వినిపిస్తుంది. సుబేదారుపేటలోని ఎబిఎం హైస్కూల్ ఆవరణలో సమాధులను సైతం పెకిలించి స్థలాలు విక్రయాలు జరిపారు. వీటి గురించి పట్టించుకోని దివాకర్ చట్టపరంగా కొనుగోలు చేసిన వాటి గురించి మాట్లాడడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఎన్నో సంవత్సరాల నుంచి జీతభత్యాలు బకాయిల కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి ఆస్తుల విక్రయం జరపడంతో వచ్చిన సొమ్మును చెల్లించారు. మిగిలిన సిబ్బందికి కూడా త్వరలోనే పూర్తి

కొరవ 14వ పేజీలో



కృష్ణపట్నం ఓడరేవుకు వచ్చిన యుద్ధనౌకలను సందర్శించి వస్తున్న స్కూల్ పిల్లలు.



నెల్లూరు రాజీవ్‌గాంధీభవన్ నేతృత్వంలో జరిగిన ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనిల్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్‌రెడ్డి.



నగర నడిబొడ్డులో ఓ బాలిక జీవనపోరాటం.

నీళ్లన్నీ నేలపాలు

## కనిగిరి రిజర్వాయర్ గేట్లు దెబ్బతిన్నాయి

బుచ్చి-కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని సదరన్ ఛానల్ గేటు దెబ్బతినడంతో నీరు వృధాగా పోతున్నది. అసలే వర్షపు నీరు రైతుల పొలాల్లోకి చేరి అవస్థలు పడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా సదరన్ ఛానల్ నుంచి నీరు వస్తుండడంతో వేలాది ఎకరాలు ముంపులోనే వున్నాయి. రెండవ నెంబర్‌గేటు దెబ్బతిన్నదని అధికారులకు సమాచారం అందినా సత్వరం దానికి మరమ్మత్తులు చేయడంలో అలసత్వం ప్రదర్శించడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నారుమళ్లు మునిగిపోయి అవస్థలు పడుతుంటే ఈ నీటి వృధా మరింతగా ఇబ్బంది పెడుతున్నదని, అధికారులు తక్షణం దెబ్బతిన్న సదరన్ ఛానల్ గేటుకు మరమ్మతులు చేసి నీటి వృధా అరికట్టాలని కోరుతున్నారు.

## ఇంకెన్ని ప్రాణాలు పోవాలి!

• నెల్లూరు - ముత్తుకూరు రూట్‌లో ప్రమాదాలు

ముత్తుకూరు-నెల్లూరు రోడ్డు మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం కృష్ణపట్నం పోర్టుకు అధికసంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతోపాటు ఎక్కడ చూసినా రోడ్డు పనులు జరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండురోజుల క్రిందట కాకుపల్లి సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. గతంలోనూ ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగి పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరొక సంఘటనలో స్థానికులు ఆగ్రహించి ప్రమాదానికి కారణమైన లారీకి నిప్పు పెట్టారు. దీంతో పోర్టు అధికారులు అక్కడక్కడ సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసినప్పటికి ప్రమాదాలు జరుగుతుండడంతో ఈ మార్గాన ప్రయాణించాలంటేనే హడలిపోవాల్సి వస్తోంది.

• పేరుకే

## పారిశుధ్య వారోత్సవాలు

అధికారులు పంచాయితీలు, మునిసిపాలిటీలలో పారిశుధ్య వారోత్సవాలు చేపట్టినా పలుచోట్ల చెత్తా చెదారపు దిబ్బలు దర్శనమిస్తున్నాయి. పొదలకూరు సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో చెత్తను తొలగించిన దాఖలాలే కన్పడడం లేదు. పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు పంచాయితీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఫోటోలకు ఫోజులివ్వడం మినహా సక్రమంగా చెత్తను తొలగించక పోవడంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురికినీరు దర్శనమిస్తున్నది. పొదలకూరు,

### పలు పంచాయితీలది ఇదే దారి

రాపూరు, కలువాయి, చేజర్ల మండల కేంద్రాలతోపాటు గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య వారోత్సవాలను నిర్వహించినా పారిశుధ్యం మాత్రం మెరుగుపడలేదు. పొదలకూరు కేంద్రంలో చెత్తదిబ్బలు దుర్గంధం వెదజల్లుతున్నా ఒక్కరూ పట్టించుకోవడం లేదు. పారిశుధ్య వారోత్సవాలతోనైనా చెత్త తొలగిపోతుందని, మురుగునీరు కనపడదని ఆశపడ్డ ప్రజల ఆశలు అడియాసలయ్యాయి తప్ప అధికారులు, పాలకుల్లో చలనం రాలేదు.

## పొదుపు మహిళల సొమ్ము మాయం!

గంగపట్నం బ్యాంకులో విచిత్రం

ఇందుకూరుపేట మండలం గంగపట్నం సిండికేట్ బ్యాంకులో పొదుపు గ్రూపుల నిధులు మాయం కావడం ఇంగగ్గోలు రేపింది. గంగపట్నం, పల్లెపాళెం, రాముడుపాళెం తదితర గ్రామాలకు చెందిన 12 గ్రూపులు సిండికేట్ బ్యాంకులో డబ్బులు జమ చేస్తుంటారు. మొత్తం 10లక్షల రూపాయలు ఈ గ్రూపు సభ్యులు బ్యాంకులో పొదుపు చేసి వున్నారు. గ్రూపులకు, సభ్యులకు తెలియకుండా మొత్తం 10లక్షల రూపాయలు ఖాతాలో నుంచి డ్రా చేసి వుండడంతో పొదుపు గ్రూపు సభ్యులు ఆశ్చర్యపోయారు. ఎవరూ డ్రా చేయకుండా నిధులు మాయం కావడంపై బ్యాంకు అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం రాకపోవడంతో దాదాపు రెండువందల మంది మహిళలు బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. సభ్యులు సంతకాలు చేయకుండా నిధులు ఎలా మాయం అవుతాయని ప్రశ్నించిన వారికి బ్యాంకు అధికారులు అభయహస్తం కోసం డ్రా చేశామని చెప్పడం ఆగ్రహం తెప్పించింది. తమ సంతకాలను ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని, వారు అధికారులను నిలదీశారు. దీనిపై విచారణ చేపడుతామని బ్యాంకు ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో పొదుపు మహిళలు శాంతించారు.

## ఆగని పశువుల తరలింపు

మూగజీవాలను కబేళాలకు తరలించే ప్రక్రియ నిరాటంకంగా కొనసాగుతూనే వుంది. అక్రమంగా వీటిని చెన్నైకు తరలిస్తున్నా పోలీసు శాఖ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. జాతీయ రహదారిపై గల పోలీస్ స్టేషన్లకు ఈ పశువుల రవాణా కాసులు కురిపిస్తుండడంతో పశువుల తోలకం దారుల వద్ద నుంచి అందినంత దండుకొని వదిలేస్తుండడంతో యథేచ్ఛగా మూగజీవాలు కళేబాలకు తరలి పోతున్నాయి. అనారోగ్యంగా వుండే పశువులను తప్ప ఆరోగ్యంగా వుండే వాటిని కబేళాలలకు తరలించరాదన్నది ప్రభుత్వ నిబంధన. కానీ దీనిని ఎవరూ ఖాతరు చేయడం లేదు. అందులోనూ పశువులను ఒక చోట నుండి మరొక చోటకు తరలించేటప్పుడు వాహనంలో నాలుగైదు పశువులకు మించి తరలించకూడదు. వాటికి తగిన ఆహారం, త్రాగేందుకు అవసరమైన నీటిని ఏర్పాటు చేయాలి. అందుకు విరుద్ధంగా ఒక్క వాహనంలో పది నుంచి పదిహేను మూగ జీవాలను రవాణా చేస్తున్నారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన రవిచంద్ర రహ దారిపై వెళ్తున్న మూగజీవాల పరిస్థితి చూసి చలించి అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకొన్నారు. కొన్నాళ్లు ఈ రవాణా ఆగినా తిరిగి ఇప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడంతో పశువులను జిల్లా నుంచి మద్రాస్‌కు తరలించడం అధికమైంది.

# వెంకటగిరికి ఎమ్పీ నిధులేవీ?

రాజ్యలక్ష్మమ్మ అడ్డుపడిందా?

మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యుడు నేదురుమల్లి జనార్థన్‌రెడ్డి తన ఎంపి నిధుల నుంచి వెంకటగిరి నియోజక వర్గానికి 64లక్షల రూపాయలు కేటాయించినా వెంకటగిరి పట్టణానికి మాత్రం ఆ నిధులలో కేటాయింపులు వుండకపోవడం పట్ల స్థానికులు నిరసన తెలుపుతున్నారు. ఇటీవల మాజీ మంత్రి రాజ్యలక్ష్మమ్మ నిధుల విడుదల వివరాలను తెలియజేశారు. కలువాయి మండలంలో 10 పనులకు 25లక్షలు, రాపూరు మండలానికి సంబంధించి 9 పనులకుగాను 24లక్షలు, సైదాపురానికి 15లక్షలు కేటాయించారు. ఈ నిధులతో సిమెంటు రోడ్లు, ప్రహరీ, రక్షిత మంచినీటి పథకాల పనులు చేపట్టనున్నారు. అయితే నియోజకవర్గ కేంద్రమైన వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు ఈ నిధుల కేటాయింపు జరగలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో వెంకటగిరి నియోజక వర్గంలో వున్న పాత మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రాకపోవడంతో నిధులు కేటాయింపు జరగ లేదని, పునర్విభజనలో క్రొత్తగా వచ్చి చేరిన రాపూరు, కలువాయి మండలాలకు మాత్రం నిధులు కేటాయించారని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. నేదురుమల్లి దంపతులకు ఉన్నత పదవులు అందించిన వెంకటగిరి వాసులను విస్మరించడం పట్ల ఆవేదన వ్యక్తమవుతున్నది.

● కావలి రిజిస్ట్రార్ ఆఫీసులో తనిఖీలు

## ఏసిబి అధికారుల దడబడలు

కావలి రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసిబి అధికారులు తనిఖీలు చేపట్టడంతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఒంగోలుకు చెందిన ఏసిబి అధికారుల బృందం కార్యాలయంలోకి అడుగుపెట్టడంతో సిబ్బంది వణికిపోయారు. ప్రకాశం జిల్లాకు చెందిన అధికారులు తమకు కావాల్సిన సమాచారం కోసం రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చారు. దీనిని ఏసిబి దాడిగా భావించిన అవినీతిపరులైన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. కొందరు సీటు వదలి బయటకు వెళ్లగా, మరికొందరు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఏసిబి దాడి జరిగిందని ప్రచారం జరగడంతో కావలిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఏసిబి అధికారులు షుమారు రెండు గంటలకు పైగా కార్యాలయంలో వుండడంతో వారు వెళ్లేంతవరకు సిబ్బంది భయం భయంగా గడిపారు. వారు వెళ్లడంతో ఊపిరి పీల్చుకొన్నారు. మొత్తం మీద ఏసిబి బృందం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించడం పట్టణంలో సంచలనం కల్గించింది.



నెల్లూరు పొదలకూరురోడ్డులోని క్యాన్సర్ ఆస్పత్రిని సందర్శించిన జెడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి. ప్రక్కన రెడ్‌క్రాస్ కార్యదర్శి డాక్టర్ ఎవి.సుబ్రహ్మణ్యం.



లెక్కలు సులభ శైలిలో చెప్పడంలో జిల్లావ్యాప్తంగా పేరుగాంచిన అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల్లో హైస్కూల్ విభాగం ఇన్‌ఛార్జి అక్కరాజు రాజేశ్వరరావును రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరిస్తున్న ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య.

# దెబ్బతిన్న నారుమళ్లు

రైతుల దిగాలు

ఇటీవల కురిసిన వర్షాలు తోటపల్లి గూడూరు మండలంలోని రైతులకు కష్టాలనే మిగిల్చాయి. అక్టోబర్ నెల చివరివారం సాగుకు అనువుగా వుంటుందని తలచి మండలంలో వరి సాగుకు శ్రీకారం చుట్టిన రైతాంగాన్ని వర్షాలు కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. పొలాలన్నీ జలమయం కావడంతో నారుమళ్లు వర్షపునీటిలో చిక్కుకొని కుళ్లిపోయాయి. నెల్లూరు జిలకర, నంద్యాల జిలకర మసూరి, 1001, 1010 రకాలు సాగుచేసినట్లయితే అధిక దిగుబడులు వస్తాయని భావించిన రైతులు విరివిగా నాట్లు వేశారు. తోటపల్లిగూడూరు, మాచర్లవారిపాళెం, పేడూరు, పాపిరెడ్డిపాళెం, చిన్నచెరుకూరు, కోడూరు, సౌత్‌ఆములూరు గ్రామాలలో 300 ఎకరాలకు పైగా నారుమళ్లు, నాట్లు వేయడం జరిగింది. వర్షాల కారణంగా ఇవన్నీ నీట మునిగాయి. నారుమళ్లు కుళ్లిపోవడంతో అప్పులు తెచ్చి సాగుచేపట్టిన రైతులు దిగాలు పడిపోయారు. విత్తనాలను ప్రభుత్వం తగినన్నీ పంపిణీ చేయకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద బస్తా విత్తనాలు 700 రూపాయలకు కొని సాగు చేపట్టారు. ఇప్పుడు వర్షాల కారణంగా నష్టపోయారు.

## రూటు మళ్లిన ఐరన్‌ఓర్ లారీలు

ఐరన్‌ఓర్ లారీలు జిల్లా ప్రజల పాలిట యమకింకరుల్లా మారిన సంగతి తెలిసిందే. వీటి క్రిందపడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. కళ్లెంలేని గుర్రాల్లా పరిగెత్తే ఈ లారీలు ఇప్పుడు పొదలకూరు వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత వారం రోజులనుంచి ఈ లారీలు సంగం, విరువూరు, పొదలకూరు, వీరంపల్లి మీదుగా కృష్ణపట్నం పోర్టుకు వెళ్తున్నాయి. మరికొన్ని లారీలు అనంతసాగరం, సోమశిల, కలువాయి, పొదలకూరు మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో ఆ ప్రాంత వాసులు హడలిపోతున్నారు. మితిమీరిన వేగంతో తిరిగే ఈ లారీలు ఎవరి ప్రాణాలు బలికొంటాయోనని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరుగుతున్నారు. మరోవైపు వందల సంఖ్యలో వెళ్తున్న ఈ లారీల పుణ్యామా అని రోడ్లు పూర్తిగా ధ్వంసం అయిపోతున్నాయని పలుగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నేత కార్మికులకు నేతల పరామర్శ

వర్షాల కారణంగా నష్టపోయిన వెంకటగిరి చేనేత కుటుంబాలను పలు పార్టీల నేతలు పరామర్శించారు. బంగారుపేట, బొప్పాపురం తదితర ప్రాంతాల్లోని మగ్గం గుంటల్లో నీరు చేరడంతో చేనేత మగ్గాలు తడిసి పనికిరాకుండా పోయాయి. చేనేతవృత్తిగా చేసుకొని కుటుంబాలను పోషించుకొంటున్న కార్మికులు వర్షాల కారణంగా పనులు నిలచిపోయి ఇక్కట్లు పడ్డారు. నేత కార్మికుల కుటుంబాలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తిరుపతి ఎమ్పీ చింతా మోహన్, మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు వర్షాల వల్ల పాడైపోయిన మగ్గాలను పరిశీలించారు.

# వరి విత్తనాలు దొరకడం లేదు!

వర్షాలు కురవడంతో వరి విత్తనాల ధరకు రెక్కలొచ్చాయి. నిన్న మొన్నటి వరకు మామూలుగా వున్న విత్తనాల ధరలు వర్షంపడి రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేయడంతో ఒక్కసారిగా పెరిగిపోయాయి. నెల్లూరు మసూరి ఎన్‌ఎల్‌ఆర్ 34449 రకం 30 కిలోలు 500 నుంచి 600 అమ్ముతుండగా ప్రస్తుతం 800 రూపాయలు అయ్యింది. రైతుల వద్ద నుంచి పుట్టి 12వేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు విత్తనాల రూపంలో ఈ ధరకు విక్రయిస్తుండడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరలకు విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు విచ్చలవిడిగా ధర నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నా వాటిని నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖాధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో రైతులపై మోయలేని భారం పడుతున్నది.

పైకి ఎగబాకిన ధరలు

## అంధకారంలో పశువైద్యశాల

కొడవలూరులోని పశువైద్యశాలకు సమస్యల జబ్బు చేసింది. వైద్యశాల ఆవరణ పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో అడవిని తలపిస్తోంది. చివరకు ఆస్పత్రికి వెళ్లేందుకు సరైన దారి లేక రైతులు, ఆస్పత్రి సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. చీకటిమయంగా వున్న ఆస్పత్రికి పశువులను తోలుకొని రావడానికి రైతులు సంకోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముళ్లపొదలకు తోడు విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంధకారం అలుముకొని వుంది. మండల కార్యాలయ భవన సముదాయాల్లో భాగంగా ట్రెజరీ కార్యాలయాన్ని నిర్మించారు. అందులో పశువుల ఆస్పత్రి ఏర్పాటు చేయడంతో సరైన వసతి, సదుపాయాలు లేక వైద్యులతోపాటు రైతులు అగచాట్లు పడాల్సివస్తోంది.

## సిఎం ప్రెస్ కార్యదర్శికి ఉద్వాసన



ముఖ్యమంత్రి ప్రెస్ కార్యదర్శిగా గత అయిదేళ్ల నుంచి కొనసాగుతున్న చంద్ర శేఖర్‌రెడ్డికి త్వరలో ఉద్వాసన పలుకనున్నట్లు సిఎం పేషీలో చెవులు కొరుక్కుంటున్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వద్ద సిపిఆర్‌ఓగా వుండి, ఆ తర్వాత వైఎస్‌కు ప్రెస్ సెక్రటరీగా వున్న చంద్రశేఖర్‌రెడ్డిపై రోశయ్యకు అనేక ఫిర్యాదులందాయట. రోశయ్యకు ఏ మాత్రం పడని ఆంధ్రజ్యోతి ఎమ్డీతో చంద్రశేఖర్‌రెడ్డి చెట్టపట్టాలు వేసుకొని మసలడం, వైఎస్ వర్గీయులతో సత్సంబంధాలు నెరపడం చంద్రశేఖర్‌రెడ్డికి ప్రతికూలాంశాలుగా మారాయట. రోశయ్య చీరాల ఎమ్మెల్యేగా వున్నప్పుడు ఓ దినపత్రికకు విలేకరిగా పని చేసిన వ్యక్తిని పిఆర్‌ఓగా నియమించుకోవాలని రోశయ్య భావిస్తున్నారట. ప్రస్తుతం ఆ విలేకరి ఓ ప్రయివేటు కంపెనీలో పౌరసంబంధాల్ని చూస్తున్నాడట.

## రోశయ్య 'మార్కు' బదిలీలు




రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. త్వరలో పెద్దఎత్తున జరుగనున్న ఈ బదిలీలపై సిఎం రోశయ్య మార్కు కొట్టొచ్చినట్లుందని సచివాలయ వర్గాలంటున్నాయి. ఇప్పటికి 56మంది ఐఎఎస్ అధికారుల జాబితా సిద్ధమైందట. ఇందులో కొన్ని జిల్లాల కలెక్టర్లు కూడా వున్నారట. గత అయిదేళ్లుగా వైఎస్ ముద్రతో వున్న అధికారుల్ని పక్కకు తప్పించి తన ముద్ర వున్నవారిని కీలకస్థానాల్లో నియమించాలని రోశయ్య కసరత్తు చేస్తున్నారు. వైఎస్ హయాంలో లూప్‌లైన్‌లోకి నెట్టబడ్డ అధికారులంతా యిప్పుడు రోశయ్య చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో సిఎం పేషీలో వచ్చేపోయే అధికారులతో రద్దీ పెరిగింది.

## మాటల యుద్ధం



లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ, చంద్రబాబుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరిద్దరి మధ్య పోరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్టీఆర్ వీరాభిమాని అయిన జయప్రకాష్‌కు చంద్రబాబంటే ఒళ్లుమంట. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచాడంటూ జయప్రకాష్ చాలాకాలం నుంచి చంద్రబాబుపై కోపంగా వున్నాడు. ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీచేయడం మొదలైనప్పటి నుండి తెలుగుదేశం ఓట్లకు పెద్దఎత్తున గండిపడింది. ఇరువురూ ఒకే కులానికి చెందినవారు కావడం వల్ల ఆ కులం ఓట్ల చీలిక తప్పడం లేదు. దీంతో చంద్రబాబు అగ్గిమీద గుగ్గిలంలా మారి జయప్రకాష్‌పై కన్నెర్ర చేస్తున్నాడు. గెలిచేది లేకపోయినా ఓట్లు చీల్చి తెలుగుదేశాన్ని ఓడిస్తున్నాడని జయప్రకాష్‌పై నిప్పులు కురిపిస్తున్నాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 70 స్థానాల్లో లోక్‌సత్తా తమ పార్టీకి చిల్లు పెట్టిందని, ఇప్పుడు హైదరాబాదు నగర ఎన్నికల్లో కూడా అదే పరిస్థితిని పునరావృతం చేస్తున్నాడని జయప్రకాష్‌ను తిట్టిపోస్తున్నాడు. కాగా కులం పేరు చెప్పి ఓట్లు అడుక్కోవడం, అధికారం కోసం వెన్నుపోట్లు పొడవడం 'బాబు'కే చెల్లిందంటూ జయప్రకాష్ ఎదురుదాడి చేస్తున్నాడు.

## 'కెకె'పై జగన్ కన్నెర్ర



పిసిసి మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం పశ్చిమబెంగాల్ పార్టీ ఇన్‌ఛార్జి అయిన కె.కేశవరావంటే జగన్‌కు ఒళ్లు మండుతోందట. 'జగన్' ఎవరో తనకు తెలీదని, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మాత్రమే తనకు తెలుసంటూ కేశవరావు వ్యాఖ్యానించడంతో జగన్‌కు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే రాష్ట్రవ్యాప్తంగా తన అనుచరులకు ఫోన్‌చేసి కెకెపై నిరసన ప్రకటించాలని పురమాయించాడట. కెకె పై వ్యాఖ్య చేసిన కొన్ని గంటల్లోనే జగన్ యువసేన ఆధ్వర్యంలో కెకె దిష్టి బొమ్మలు దగ్ధమయ్యాయి. కొంతకాలంగా కెకె రాష్ట్ర రాజకీయాల పట్ల ఉత్సాహం చూపిస్తున్నాడు. ఇందులో భాగంగానే జగన్ సిఎం ఆశలపై తనవంతు నీళ్లు చల్లుతున్నాడు. ఇందులో భాగంగానే 'జగన్'పై కావాలనే కెకె పై విధంగా వ్యాఖ్యానించాడట. ప్రస్తుతం ఢిల్లీలో పలుకుబడిని సంపాదించుకున్న కెకెకు అవకాశం వస్తే సిఎం కావాలన్న ఆశకూడా వుందట. అది కూడా జగన్‌కు కన్నెర్రగా వుందట.

## 'బాబు' ఓటు రోశయ్యకే!



రాష్ట్రంలో సిఎంగా ఎవరుండాలి? రోశయ్యా! జగనా? కెకేనా? డిఎస్సా లేక ఇతరులు ఎవరైనా.... అంటూ ఓటింగ్ పెడితే చంద్రబాబు మాత్రం ఖచ్చితంగా రోశయ్యకే ఓటేస్తాడు. ప్రస్తుత పరిస్థితుల్లో రోశయ్య వంటి నాయకుడే సిఎంగా వుండటం తెలుగుదేశం పార్టీకి అన్నివిధాలా క్షేమకరమని చంద్రబాబు భావిస్తున్నాడు. అందుకే రోశయ్య పట్ల ఉదారంగా వుండాల్సిందిగా పార్టీ నాయకులకు హితబోధ చేస్తున్నాడు. రోశయ్య వుండటం మనకే మంచిది. పొరపాటున జగన్ కానీ, ఇతర నాయకుడెవరైనా సిఎం అయితే మనకు తీవ్రనష్టం జరుగుతుంది. అందుకే రోశయ్య సిఎం పదవికి ముప్పుతెచ్చేవిధంగా వ్యవహరించొద్దంటూ పార్టీ కేడర్‌కు తాకీదు జారీచేశాడట. రోశయ్యను తీవ్రంగా వ్యతిరేకించే నాగం జనార్దనరెడ్డి వంటివారికి మాత్రం 'బాబు' నిర్ణయం యమబాధగా వుందని పార్టీ వర్గాలంటున్నాయి.

## శ్రీ లక్ష్మికి కష్టకాలం



గనులశాఖ కార్యదర్శిగా ఓబుళాపురంలో అవకతవకలకు పాల్పడిన శ్రీలక్ష్మికి కష్టకాలం మొదలైంది. గాలి జనార్దనరెడ్డి ప్రభృతులకు అనుకూలంగా నిబంధనలకు నీళ్లొదిలి గనుల్ని కేటాయించిన శ్రీలక్ష్మిని రోశయ్య ఆ మధ్య ఆగమేఘాల మీద బదిలీ చేశాడు. కొత్తపోస్టులో చేరడానికి మనసొప్పక శ్రీలక్ష్మి సెలవు పెట్టింది. ప్రస్తుతం కూడా సెలవులోనే వుందట. ఓబుళాపురం గనుల అక్రమాలపై సుప్రీంకోర్టు సాధికార కమిటీ యిచ్చిన నివేదిక ప్రభుత్వానికి చేరడంతో మంగళవారం సాయంత్రం రోశయ్య ఉన్నతాధికారులతో సమీక్షించాడు. ఈ సమావేశానికి శ్రీలక్ష్మికి కూడా కబురుపెట్టారు. అయితే తాను సెలవులో వున్నానని సాకుచూపి మీటింగ్‌కు ఎగ్గొట్టాలని ప్రయత్నించినట్లు వినికిడి. అయితే మీటింగ్‌కు హాజరుకావాల్సిందేనంటూ సిఎం పేషీ నుంచి ఒత్తిడి పెరగటంతో శ్రీలక్ష్మి దిగిరాక తప్పలేదు. సమావేశంలో సిఎం అడిగిన అనేక ప్రశ్నలకు శ్రీలక్ష్మి దగ్గర సరైన సమాచారం లేదని అభిజ్ఞవర్గాల కథనం.

## 'గాలి', మ్యాట్రిక్స్ ప్రసాద్‌పై రోశయ్య రుసరుసలు



ఓబుళాపురం 'గనుడు' 'గాలి' జనార్దనరెడ్డి అన్నా... 'వాన్‌పిక్' మ్యాట్రిక్స్ ప్రసాద్ అన్నా... రోశయ్య రుసరుసలాడుతున్నాడట. వైఎస్ సిఎంగా వున్నప్పుడు 'గాలి', 'మ్యాట్రిక్స్' హవా కొనసాగింది. నిబంధనలకు నీళ్లొదిలి 'గాలి'కి వేలాది ఎకరాల ఇనుపఖనిజం గనుల్ని కేటాయించగా... మ్యాట్రిక్స్ ప్రసాద్‌కు వాన్‌పిక్ పేరుతో రాష్ట్రంలోని 28వేల ఎకరాల కోస్తా తీరప్రాంతాన్ని రాసిచ్చారు. ఈ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చెలరేగటం, ఓబుళాపురం గనులపై సుప్రీంకోర్టు సాధికార కమిటీ తప్పుబట్టడాన్ని రోశయ్య తీవ్రంగా భావిస్తున్నారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి సవాలుగా మారిన ఈ కుంభకోణంపై కత్తి ఝళిపించాలని రోశయ్య నిర్ణయించారని విశ్వసనీయవర్గాల కథనం. అయితే పై రెండు కుంభకోణాల్లో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారడంతో రోశయ్యపై ఒత్తిడి కూడా అంతే స్థాయిలో వుంటుందని ప్రభుత్వ వర్గాలంటున్నాయి.

## రఘు'వీర' భజన



భజన చేసే విధము తెలియండి... రోశయ్య భజన చేసి 'పదవి' పొందండి అంటున్నాడు వ్యవసాయ మంత్రి రఘువీరారెడ్డి. నిన్నమొన్నటిదాకా వైఎస్ వీరాభిమానిగా వున్న రఘువీరా యిప్పుడు ప్లేటు ఫిరాయించాడు. వచ్చేనెలలో రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు – చేర్పులు జరుగనున్న నేపథ్యంలో రఘువీరా స్వరం మార్చాడు. జగన్‌ను సిఎం చేయాల్సిందేనంటూ తీవ్రంగా మాట్లాడిన రఘువీరా ఇప్పుడు మెత్తబడ్డాడు. రోశయ్య వంటి అనుభవజ్ఞుడ్ని తానిప్పటిదాకా చూడలేదంటూ పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నాడు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సిఎంగా సాధించిన విజయాలు ఆయన సొంతం కావని, వాటి వెనుక రోశయ్య హస్తముందంటూ కొత్తగా స్టేట్‌మెంట్ యిచ్చాడు. వైఎస్ లేకపోయినా ఆయన ఆశయాల్ని సజీవంగా ఉంచడానికి రోశయ్య ఎంతగానో కృషి చేస్తున్నారంటూ రఘువీరా ప్రశంసలతో ముంచెత్తుతున్నాడు. ఏ ఎండకాగొడుగు పట్టడం రఘువీరా దగ్గరే నేర్చుకోవాలంటూ కొందరు మంత్రులు చెవులు కొరుక్కుంటున్నారు.

# త్యాగనిరతిని చాటే బక్రీద్ పండుగ!

బక్రీద్ నెలలో ముస్లిం సోదరులు చేసే హజ్‌యాత్రలో మక్కా పుణ్యక్షేత్ర దర్శనం తప్పనిసరి. అక్కడ ప్రార్థనలో వున్న భక్తజనం.



మనిషి యొక్క త్యాగనిరతిని తెలియజెప్పే పండుగే బక్రీద్. దీనినే ఈదుల్‌జుహా అంటారు. దీనినే త్యాగాల పండుగ అని కూడా పేర్కొంటారు. దైవదూత (హజ్రత్)గా పిలవబడే ఇబ్రహీం త్యాగనిరతిని, కీర్తిప్రతిష్టలను తెలియజేసే విధంగా జరుపు కొనే శుభదినం బక్రీద్. హజ్రత్ ఇబ్రహీం నిద్రిస్తున్న సమయంలో ఆయన కలలో అల్లా కన్పించి నీ కుమారుడిని బలి ఇవ్వమని కోరాడని, నిద్ర నుండి మేల్కొన్న ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌కు అల్లా కోరికను తెలియజేశాడని, పిన్న వయస్కుడు, దైవభక్తుడైన ఇస్మాయిల్ అందుకు అంగీకరించడంతో బలికి దైవదూత సిద్ధమయ్యాడని చెబుతారు. ఇబ్రహీం త్యాగనిరతికి సంతోషించిన అల్లా, ఇస్మాయిల్ స్థానంలో ఒక గొర్రెను సృష్టించాడు. ఇస్మాయిల్‌కు బదులు గొర్రె కుత్తుకను ఇబ్రహీం జుబా(కోయడం) చేస్తారు. భగవంతుడు అడిగిన వెంటనే తన ఏకైక కుమారుడి తలను ఇబ్రహీం కోసి ఇవ్వడానికి గుర్తుగా జరుపుకునే ఈ పండుగకు బక్రీద్ అని పేర్కొంటారు. ఇబ్రహీం త్యాగనిరతిని స్మరిస్తూ ప్రపంచంలోని ముస్లిందరూ ఈ పండుగను ఘనంగా జరుపు కొంటారు. ఈద్గాల వద్ద ధార్మిక ప్రసంగం (ఖుత్బా)తో పండుగ ప్రారంభం అవుతుంది. అనంతరం గొర్రె, మేకలను బలివ్వడం(ఖుర్బాని) చేస్తారు. ఈ ఆహారాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని తనకోసం, రెండో భాగాన్ని బంధువులు, స్నేహితుల కోసం, మూడవ భాగాన్ని పేదలకు పంచి పెట్టాలన్నది ఒక నియమం. పండుగ రోజున ముస్లింలు ఈద్గాలలో ప్రార్థనలు జరుపుతారు. అనంతరం ఈద్ ముబారక్ అని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొంటారు.

ఇస్లాంలోని ఐదు ప్రధాన సూత్రాలలో ఒకటైన హజ్ యాత్రను ఈ మాసంలోనే చేయాల్సి వుంటుంది. బక్రీదుకు ముందు రోజున తమ కుటుంబాల్లో చనిపోయిన పెద్దల స్మృత్యంకంగా ఆరాధన చేస్తారు. త్యాగానికి ప్రతీకగా ఇబ్రహీం ప్రవక్త చూపిన మార్గం అందరికీ ఆదర్శనీయం.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### పొయ్యిలో పిల్లిలేవని పోలీసులు



నెల్లూరు పోలీసు దొరల ఇళ్లలోని పొయ్యిలో పిల్లి నిద్ర లేవడం లేదు. నగరంలో మంచి భోజన హోటళ్లు, వాటిలో రుచికరమైన నాన్‌వేజ్ ఐటమ్స్, డిష్‌లు దొరుకుతుండడంతో ఇళ్లలో ఆడవాళ్లు వంట చేయక టీవీ సీరియళ్లు చూస్తూ కాలం గడుపుతున్నారు. వేళకు కడుపులో ఎలుకలు పరుగెత్తగానే సతులకు ఫోన్లు చేస్తారు. వెనువెంటనే వీరు తమ వద్ద వున్న జిడి కానిస్టేబుళ్లను పూటకో హోటల్‌కు క్యారియర్ ఇచ్చి పంపుతున్నారు. పోలీసుల క్యారియర్లు నింప కుంటే ఏదో ఒక కేసు పెడతారన్న భయంతో తిట్లతోకూడిన నవ్వుముఖం పెడుతూ హోటల్ యజమానులు పంపుతున్నారు.

### వాళ్లు మేల్కొన్నారు



నెల్లూరులోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖాధికారులు లంచాల గడ్డి మేయడం తప్ప అవినీతి పరులను పట్టుకోను ధైర్యం చేయరు. ఈ మధ్య అధికార పార్టీలో ఏర్పడిన రెండు గ్రూపుల మధ్య వైరం విజిలెన్స్ అధికారులను పరుగులు పెట్టిస్తోంది. తామందించిన సమాచారంపై స్పందించకుంటే వున్నతాధికారులకు ఫిర్యాదు చేస్తుండడంతో అడపాదడపా వీరు దాడులు చేయక తప్పడం లేదు. ఓ వర్గం ఇచ్చిన సమాచారం మేరకు ఓ ఇసుకరీచ్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో 9 జెసిబీలు, 18 లారీలు, ఐదు ట్రాక్టర్లు పట్టుపడ్డాయి. వీటిమీద కేసులు కట్టి రికార్డులు పరిశీలించడంతో ఆశ్చర్యపోయే విషయాలు తెలిశాయి. దీంతో ఏం చేయాలన్న ఆలోచనలో వున్నారు విజిలెన్స్ అధికారులు.

### సుమన్ కొత్త గెటప్



నెల్లూరుకు, నటుడు సుమన్‌కు బాదరాయణ సంబంధం వుంది. ఆయన తొలిచిత్రం షూటింగ్ ఇక్కడే జరిగింది. నెల్లూరీయులైన పలువురు నిర్మాతలు ఆయనతో చిత్రాలు తీశారు. ఇక్కడి అభిమానుల పెళ్లిళ్లకు, ఏడాదికోసారి జరిగే ఆయన జన్మదినోత్సవ వేడుకలకు హాజరవుతుంటారాయన. అటువంటి సుమన్ సినిమాల్లో వేషం మార్చినట్లు అకస్మాత్తుగా గౌడ నాయకుని అవతారం ఎత్తారు. కావలిలో జరిగిన జిల్లా స్థాయి మహాసభల్లో పాల్గొన్న ఆయన గౌడకులస్తుల న్యాయమైన హక్కుల కోసం పోరాడుతానన్నారు. ఈ వ్యవహారంలో మహానాయకులు నెల్లూరీయులు పుచ్చలపల్లి సుందరయ్య, డాక్టర్ రామచంద్రారెడ్డిలు తనకు ఆదర్శమన్నారు. సినిమా ఫక్కీలో సుమన్‌లో వచ్చిన ఈ మార్పుకు విస్తుపోవడం నెల్లూరీయుల వంతయ్యింది.

### భయంలేని దొంగలు



దొంగలకు నెల్లూరు పోలీసులంటే భయం లేకుండాపోయింది. ఏకంగా వాళ్లింటికే కన్నాలు వేసే స్థాయికి ఎదిగిపోయారు. ఇక్కడ ఇంటలిజెన్స్ ఎస్‌ఐగా పనిచేసే సత్యనారాయణ హైదరాబాద్‌లోని పోలీసు అకాడమీకి శిక్షణకు వెళ్లారు. ఇదే అదనుగా లెక్చరర్స్ కాలనీలోని ఆయన ఇంట్లో దూరిన దొంగలు 75 సవర్ల బంగారు, పది కిలోల వెండి, పదివేల నగదు పట్టుకెళ్లారు. సామాన్యుల ఇళ్లలో పడే దొంగలను నెల్లూరు పోలీసులు పట్టుకోరు. కనీసం తమ శాఖీయుడి ఇంట్లోపడిన దొంగలనైనా పరవుకోసం పట్టుకోవాల్సిన అవసరం లేదంటారా?

### రివర్స్‌గేర్



నెల్లూరు నగరంలో డెంగ్యూ, చికున్ గున్యా, టైఫాయిడ్, మలేరియా జ్వరాలు విజృంభించాయి. పదుల సంఖ్యలో వ్యాధిగ్రస్తులు ప్రాణాలు కోల్పోయారు. అయినా కార్పొరేషన్ పాలకులు, అధికారుల్లో చలనం లేదు. వీరి మత్తు నిదర వదలగొట్టను తెలుగుదేశం పార్టీ డాక్టర్స్ సెల్ వినూత్న నిరసన తెలియజేసింది. కార్పొరేషన్ ఆఫీసు ఎదుట మెగా ఉచితవైద్య శిబిరం నిర్వహించింది. వందలాది మంది రోగులు ఈ శిబిరానికి వచ్చి చికిత్స చేయించుకొన్నారు. వుచితంగా మందులు తీసుకెళ్లారు. పోతూపోతూ తమకు మెరుగైన జీవనవసతులు కల్పించలేని అధికారపార్టీపై మెటికలు విరిచారు. తాము ఆశించింది ఇదే కావడంతో తెలుగునేతల ముఖాలు విప్పారాయి.

# సమస్యల ఊబిలో ఊటుకూరు!

విడవలూరు మండలం ఊటుకూరు గ్రామ పంచాయితీ అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేకపోతుంది. మేజర్ పంచాయితీగా పేరొందినప్పటికి నిధులు మాత్రం అంతంతమాత్రంగానే మంజూరవుతున్నాయి. మంజూరైన కొద్దిపాటి నిధులు పంచాయితీ పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సరిపోవడం లేదు. ప్రభుత్వపరంగా ఆశించిన మేరకు సహాయ సహకారాలు అందడం లేదన్న వాదన వినిపిస్తుంది. పంచాయితీ పరిధిలో అంతర్గత రోడ్లు, రక్షిత మంచినీరు, మురికి నీరు పోయేందుకు డ్రైనేజి కాల్వల నిర్మాణాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఊటుకూరు గ్రామ పంచాయితీ పరిధిలో 2,600 కుటుంబాలు, 10వేల జనాభా 6వేల మంది ఓటర్లు వున్నారు. ఈ పంచాయితీలో 14వార్డులు వున్నప్పటికి మెజార్టీ సభ్యులందరూ తెలుగుదేశం పార్టీకి చెందినవారు. దీనివల్ల ఆ పార్టీకి చెందిన బెజవాడ విజయ భారతి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు జరిగిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో వుంది. ఈ పంచాయితీ కోవూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వుండడంతో అప్పటి ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో వివక్షత చూపించారన్న ఆరోపణలున్నాయి.

ఈ సంవత్సరం జరిగిన ఎన్నికలలో కోవూరు అసెంబ్లీ నియోజవర్గం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే ఈయన ఎమ్మెల్యే అయిన తర్వాత పంచాయితీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించడం, తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ కావడం వంటి సంఘటనలు చోటు చేసుకున్న విషయం అందరికి తెలిసిందే. గ్రామ సర్పంచ్ మహిళ కావడంతో ప్రజలు ఏదైనా సమస్య పరిష్కారం కోసం వెళ్లలేక పోతున్నారు.



ఊటుకూరు గ్రామ పంచాయితీ కార్యాలయం.

పంచాయితీ కార్యాలయానికి సమావేశాలు సందర్భంలో మాత్రమే సర్పంచ్ వస్తుంటారని ప్రజలు చెప్పారు. మిగిలిన సమయంలో ఉపసర్పంచ్‌తో సహా ఎవరూ అందుబాటులో వుండకుండా పోతుంటారు. గ్రామ సమీపంలో వున్న ఇసుకరీచ్‌ల నుంచి పంచాయితీకి 2లక్షల రూపాయలు సెస్సు రూపంలో జమ అవుతుంటాయి. ఇవి కాకుండా ఎస్.ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు మరో 2లక్షలు, పన్నుల రూపంలో 5లక్షల రూపాయలు పంచాయితీ రాబడిగా వున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయితీలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు దిగువనిస్తున్నాం.

### ఉప్పునీరు తాగుతున్నాం!



గ్రామంలో త్రాగేందుకు మంచినీరు దొరక్క ఉప్పు నీటిని త్రాగుతున్నాం. నెల్లూరు నగరం నుంచి వ్యాన్ల ద్వారా ప్రతి రోజు వాటర్ క్యాన్లు వస్తుంటాయి. వీటిని ప్రతిరోజు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత కలిగినవారు తీసుకుంటారు. పేద ప్రజలు మాత్రం ఉప్పునీటిని త్రాగి జీవించాల్సి వుంటుంది. ఈ విషయం అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

– మధుసూధనరావు

### అభివృద్ధికి కృషి!



గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికైన నాటినుంచి గ్రామాభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను. పంచాయితీకి ప్రభుత్వం నుంచి వస్తున్న కొద్దిపాటి నిధులతోనే సిమెంటురోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు తదితర పనులు పూర్తిచేయడం జరిగింది. అయితే గ్రామంలో త్రాగునీటి సమస్య వుంది. మంచినీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ట్రాక్టర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయాలి.

– బెజవాడ విజయభారతి

**అవినీతి కథ**

# అక్రమబాటన వంటగ్యాస్ ఏజన్సీలు!

**నెల్లూరు నగరంలో వంటగ్యాస్ సరఫరా అస్థవ్యస్థంగా తయారయ్యింది. బుక్‌చేసిన వినియోగదారులకు సరిగ్గా సిలిండర్లు రావు. కొత్త కనెక్షన్లకు ఐదారువేలు వసూలు చేస్తున్నారు.**

జిల్లావ్యాప్తంగా సకాలంలో గ్యాస్ సిలిండర్లు దొరక్క వినియోగదారులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్న సంఘటనల గురించి పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలిసినప్పటికీ సంబంధిత గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒక ప్రక్క గ్యాస్ అందక వినియోగదారులు ఇబ్బంది పడుతుంటే మరోప్రక్క హోటళ్లు, టీబంకులు, రకరకాల వ్యాపారాలు చేసేవారికి గ్యాస్ సరఫరా నిరాటంకంగా జరిగిపోతుంది. గ్యాస్ కనెక్షన్ల దగ్గర నుంచి గ్యాస్ సిలిండర్ల సరఫరా వరకు ఏజెన్సీ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు.

అధికారుల ఉదాసీన వైఖరి, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకుల అవినీతి, అక్రమాల కారణంగా గ్యాస్ కనెక్షన్ కోసం అధిక ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్తగా గ్యాస్ కనెక్షన్ పొందాలంటే సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి దరఖాస్తు చేసుకోవాలి. గ్యాస్ కనెక్షన్ మంజూరైన తర్వాత మొత్తం 1556 రూపాయలు చెల్లిస్తే కనెక్షన్‌తోపాటు గ్యాస్ సిలిండర్ కూడా వినియోగదారునికి అందజేయాలి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యి, గ్యాస్ కనెక్షన్ మంజూరయ్యేందుకు కనీసం మూడు నుంచి ఆరు నెలల కాలవ్యవధి పడుతుంది. కొన్ని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం 15 రోజుల్లోనే గ్యాస్ కనెక్షన్ ఇచ్చేస్తున్నారు.

ఇందుకు ఉదాహరణగా నెల్లూరు నగరంలో వాహాబ్‌పేటలో వున్న భారత్‌గ్యాస్ ఏజెన్సీని పేర్కొనవచ్చు. ఈ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధికమొత్తం వసూలు చేసుకోవడంలో సఫలీకృతులవుతున్నారు. గ్యాస్ కనెక్షన్ కోసం వచ్చిన వినియోగదారులకు వారం, పది రోజుల్లో గ్యాస్ కనెక్షన్ ఇస్తామని, కానీ ఇందుకు అదనంగా మరికొంత నగదు ఇవ్వాల్సి వుంటుందని ముందుగానే చెబుతారు. అయితే తక్కువ వ్యవధిలోనే గ్యాస్ కనెక్షన్ వస్తుందన్న ఆశతో ఏజెన్సీ నిర్వాహకులు అదనంగా అడిగిన నగదును అందజేస్తున్నారు వినియోగదారులు.

ప్రభుత్వ నిబంధనలను తుంగలో త్రొక్కి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వినియోగదారుల నుంచి అధిక సొమ్ము వసూలుచేసి మోసం చేస్తున్నారు. కొత్త గ్యాస్ కనెక్షన్ కోసం వినియోగదారుని అవసరాన్ని బట్టి నాలుగువేల నుంచి ఐదు వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. అయితే రశీదు మాత్రం 1556 రూపాయలకే అందజేయడం ఇక్కడ విశేషం. రోజు రోజుకు గ్యాస్ వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇదిలా వుండగా గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు గ్యాస్ బుక్ చేసుకున్న ఇరవై రోజులకు కూడా సరఫరా చేయడం లేదు. బ్లాక్ మార్కెట్లో మాత్రం గ్యాస్ సిలిండర్లు నిత్యం అందుబాటులో వుంటున్నాయి.

వినియోగదారుడు ప్రశ్నిస్తే స్టాకులేదని సమాధానం వస్తుంది. అయితే వినియోగదారునికి అందని గ్యాస్ సిలిండర్లు బయట మార్కెట్లోకి ఎలా చేరుతున్నాయో అధికారులు, ఏజెన్సీల నిర్వాహకులకే తెలియాలి. బయట మార్కెట్లో నిన్న మొన్నటి వరకు గ్యాస్ సిలిండర్‌ను 500 రూపాయలకే విక్రయించే వ్యాపారులు నేడు 700 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఏజెన్సీల నుంచి అవసరానికి గ్యాస్ రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో 700 రూపాయలు చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకపోతే ప్రభుత్వం దీపం పథకం ద్వారా స్వయంసహాయక సంఘం సభ్యులకు గ్యాస్ కనెక్షన్లను గతంలో మంజూరు చేసింది. వీరికి గ్యాస్ కావాలంటే నెల రోజులు పడుతుంది. ఒకసారి గ్యాస్ సిలిండర్ ఇస్తే తిరిగి నెల రోజుల తర్వాత గ్యాస్ బుక్ చేసుకోవాలి. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత మరో ఇరవై రోజులకుగానీ గ్యాస్ సిలిండర్ అందదు. దీపం పథకం గ్యాస్ కనెక్షన్లు పొందిన వారి పరిస్థితి ఇంత దారుణంగా వుంటుంది. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా అసలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మొత్తం మీద గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చేస్తున్న మోసం కారణంగా సామాన్య ప్రజలు దగాపడక తప్పడం లేదు. అధికారులు స్పందించి మోసాలను అరికడతారో? లేదో? వేచి చూడాలి.




వివాదాస్పద బాటలో భారత్‌గ్యాస్ ఏజన్సీ.

## గాలి జోరు

మొదటి పేజీ కొరవ

### వైఎస్ జగన్‌కు ముక్కుతాడు!

గాలి గనుల నిలిపివేతలో అనేక అంశాలు ఇమిడి వున్నాయి. ముఖ్యమంత్రి పదవి కోసం తమ మీద విపరీతమైన ఒత్తిడి తెస్తున్న వైఎస్ జగన్‌ను అదుపు చేయడం ఇందులో మొదటిది. తమను ధిక్కరిస్తే నీ వ్యాపారాలకు ఏ గతి పడుతుందో దీన్నొక ఉదాహరణగా చూడమని జగన్‌కు సందేశం పంపింది కాంగ్రెస్ అధిష్టానం. అయితే ఇటు జగన్, అటు గాలి సోదరులు ఆర్థికంగా వూహించని స్థాయికి ఇప్పటికే ఎదిగిపోయారు. అందువల్ల ఈ గనులు తాత్కాలికంగా ఆగినంత మాత్రాన వారికి వచ్చే ఆర్థిక ఇబ్బందులు ఏమీ వుండవు. ఈ ఉత్తర్వులపై ఎటూ న్యాయపోరాటం చేస్తారు. చేతినిండా డబ్బు వున్నవాడికి మన కోర్టులు, చట్టాలు ఎంతటి దగ్గరి చుట్టాలో లోకానికంతా తెలుసు. కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్పకు, బిజెపి నాయకత్వానికి కూడా సంతోషం కల్గించే పరిణామం ఇది. కాగల కార్యం గంధర్వులు తీర్చారని సంబరపడుతున్నారు వారు.

### అడిగితే ఏమీ ఇవ్వరు

ఒకపక్క ఈ ఉత్తర్వులు, మరొకపక్క పులివెందుల టిక్కెట్ తన తల్లికి కేటాయించడంతో జగన్ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. అధిష్టానం తనంతట తానుగా నాకు ఏ అవకాశమూ ఇవ్వదన్న అభిప్రాయం ఏర్పడింది ఆయనలో. ముఖ్యమంత్రి పదవి అయినా, వ్యాపారాల రక్షణ అయినా పోరాడి సాధించుకోవల్సిందే తప్ప, అడిగితే ఇచ్చేవి కావని బాగా అర్థమైంది. అధిష్టానం తన వ్యాపారాల మీద అంతగా దాడికి సిద్ధపడుతుందని జగన్ వూహించలేదు. దానితో ఆయన దూకుడు కొంత తగ్గింది. నెలక్రితం వున్న ఆవేశం లేదు. తాను వేసే ప్రతి అడుగూ ఆచితూచి వేయకుంటే ఎదురు దెబ్బలు తప్పవనే భయంతో జాగ్రత్తలు తీసుకొంటున్నాడు. పులివెందులలో అధిష్టానం తనకు టిక్కెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా పోటీ చేయాలని రెండు వారాలుగా జరుపుతున్న మంతనాల విషయంలో కూడా పునరాలోచనలో పడ్డాడు.

### వెనక్కు తగ్గిన ఎమ్మెల్యేలు

పులివెందుల టిక్కెట్ ఇవ్వలేదంటే అర్థం, ముఖ్యమంత్రి పదవి కూడా ఎప్పటికీ ఇవ్వదని. తన తండ్రిని పాతికేళ్లపాటు ఇదేరీతిలో ఏడ్పించారని, అంతకాలం ఎదురుచూసే ఓపిక తనకు లేదని జగన్ భావం. కానీ ఇప్పటికిప్పుడు చేయగల్గింది ఏమి వుంది? పార్టీ మీద తిరుగుబాటుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్పీల నుంచి ఆశించినంత సానుకూలత కన్పించడం లేదు. వైఎస్ మరణానంతరం జగన్ కోసం తమ ప్రాణాలిస్తామని బీరాలు పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు మెల్లమెల్లగా ముఖం చాటేస్తున్నారు. రోశయ్య అనుగ్రహం కోసం ప్రాకులాడుతున్నారు. జగన్‌ను చూడడానికి రావడం కూడా తగ్గించి వేశారు. తొందరపడి తిరుగుబాటు అంటే, పక్కన పది మంది కూడా లేని పరిస్థితి వచ్చే ప్రమాదం వుంది. అదే జరిగితే, తిరుగుబాటు చేసి ప్రయోజనం లేదు. కనీసం 50 నుంచి 60 మంది ఎమ్మెల్యేలను కూడగట్టుకోగల్గితే, ప్రభుత్వాన్ని పడగొట్టి ఎన్నికలకు వెళ్ల వచ్చునని, వైఎస్ మీద వున్న సానుభూతితో గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించుకొంటే, శరద్‌పవార్, మమతాబెనర్జీల వలె తనకూ కాంగ్రెస్ అధిష్టానం గుర్తింపు, గౌరవం ఇవ్వక తప్పదని జగన్ భావించాడు. కానీ ఎమ్మెల్యేలు అందుకు సహకరించడం లేదు.

ఎమ్మెల్యేలు ఇష్టపడడం లేదు కాబట్టి, ఇప్పటికిప్పుడు తిరుగుబాటు కాకుండా, అధిష్టానం మీద ఒత్తిడి పెంచడానికి ప్రజల మద్దతు కూడకట్టడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని జగన్ భావన. రాష్ట్రంలో విస్తృతంగా తిరిగి, లక్షల సంఖ్యలో జనాన్ని సమీకరించి, పెద్ద పెద్ద సభలు పెట్టి, తనను కాదంటే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పుట్టగతులు వుండవన్న భయాన్ని అధిష్టానంలో కల్గించాలని ఆయన వ్యూహం రచిస్తున్నాడు.

### హెచ్చిన స్వరం

23తేది ఢిల్లీ వెళ్లిన జగన్ సోనియా గాంధీతో పాటు, అహ్మద్‌పటేల్, వీరప్పమొయిలీ వంటి అధిష్టాన దేవతలను కలిశాడు. ఈ సమావేశాలలో ఆయన స్వరం పెంచి మాట్లాడాడని చెప్తున్నారు. నేను అడిగింది ఎటూ మీరు ఇవ్వరు కాబట్టి, నాకు కావల్సింది మీ నుంచి తీసుకోవడానికి పోరాటమే మార్గమని వారికి అర్థమయ్యేట్లు చెప్పి వచ్చాడట.

## ఇసుక సంకటం

16వ పేజీ కొరవ

నెల్లూరు జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు ఎంత పెద్ద రాజకీయ దుమారం రేపుతున్నది తెలిసిన సంగతే. ఇసుక కాంట్రాక్టర్లు ఒక మాఫియా వలె తయారై కోట్లాది రూపాయలు దోచుకొంటున్నారు. ఈ ఇసుకదొంగలకు నాయకత్వం ఆనం సోదరులది. అందుకుగాను వారికి ప్రతి నెల లక్షలాది రూపాయలు ముడుపులు అందుతున్నాయి. జిల్లాలో రాజకీయ అధికారం తమదే కాబట్టి, ఈ దోపిడీని యదేచ్ఛగా జరిపిస్తుండినారు. ఆనం వారితో విభేదాల నేపథ్యంలో జెడ్పి చైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇసుక దొంగల మీద యుద్ధం ప్రకటించడంతో అధికారులు ఇరకాటంలో పడిపోయారు. మొదట మొదట కొంత సంశయించినా గోవర్ధన్‌రెడ్డి గట్టిగా పట్టుబట్టడంతో అనధికారిక ఇసుక త్రవ్వకాన్ని నిక్కచ్చిగా నిలిపివేసి, ఇసుక దొంగల నుంచి పది కోట్ల రూపాయల వరకు వసూలు చేసి, ప్రభుత్వానికి చెల్లించారు. అయితే కథ ఇక్కడితో ముగిసి పోలేదు. అధికారికంగా డబ్బు కట్టినప్పటికీ, ఇసుక త్రవ్వకానికి కొన్ని నియమాలున్నాయి. యంత్రాలు పెట్టి త్రవ్వకూడదు. మనుషుల చేత మాత్రమే తీయించాలి. నది లోపల రెండు మీటర్ల లోతుకు మించి ఇసుక తీయకూడదు. నది కరకట్టలను చెదరగొట్టి, రోడ్లు వేయకూడదు. ఈ నిబంధనలు పాటిస్తే కోట్లు చెల్లించిన కాంట్రాక్టర్ల చేతికి చిప్ప మిగులుతుంది. అందువల్ల వారందరూ భారీ యంత్రాలు వాడి, పెన్నా నదిలో నిలువులోతు గుంటలు పెట్టి, కరకట్టలను ధ్వంసం చేసి రోడ్లు వేసుకొని, వందలాది లారీలతో ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ అక్రమం మీద గోవర్ధన్‌రెడ్డి మళ్లీ నిరసన గళం విన్పించాడు. దానితో స్థానిక విజిలెన్స్ అధికారులు ఇసుక కాంట్రాక్టర్ల మీద దాడులు జరిపి జెసిబి, పొక్లెయిన్ వంటి యంత్రాలను, లారీలను స్వాధీనం చేసుకొన్నారు. ఇది పెద్ద గొడవగా మారడంతో దినేష్‌రెడ్డి స్వయంగా వచ్చి పొక్లెపాళెం వద్ద పరిస్థితి స్వయంగా చూసి వెళ్లారు. కానీ ఆయన అటుపోగానే మళ్లీ యంత్రాలు, లారీలు పెన్నలో దిగాయి. గోవర్ధనరెడ్డి మళ్లీ గొడవ చేశాడు. దానితో విజిలెన్స్ అధికారులు మళ్లీ దాడులు చేయక తప్పలేదు.

ఇసుక కాంట్రాక్టర్లంతా ఇప్పుడు జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీద ఒత్తిడి తెస్తున్నారు. మీ అన్న తమ్ముళ్లకు నెల నెలా లక్షల రూపాయలు ముడుపులు చెల్లించేది ఎందుకని నిలదీస్తున్నారు. మంత్రిగారికి వూపిరాడడం లేదు. ఎట్లయినా మళ్లీ ఇసుక త్రవ్వకాలను మొదలు పెట్టించాలని, అధికారులు స్వాధీనం చేసుకొన్న యంత్రాలు, వాహనాలను విడిపించాలని ప్రయత్నిస్తున్నాడు. గనుల శాఖ అధికారులను బెదరిస్తున్నాడు. ఆ ఒత్తిడి తట్టుకోలేక జిల్లా మైనింగ్ అధికారి సెలవుపెట్టి వెళ్లిపోయాడు. ఈ ఇసుక గొడవ మాకొద్దు, పాత పద్ధతిలో పంచాయితీలకే అప్పచెప్పండని ప్రభుత్వానికి ఒక నివేదిక కూడా పంపాడట.

ఆనం సోదరులకు, దినేష్‌రెడ్డికి దగ్గరి సంబంధాలున్నాయి. స్నేహబంధుత్వం వుంది. సహజంగానే వారు ఆయన్నూ మొగమాట పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఈ విషయంలో విజిలెన్స్ శాఖ ఏ మాత్రం మెత్తబడిందనే భావన కల్గినా జిల్లాలో అల్లరైపోతుంది. అటువంటి అపప్రద తెచ్చుకోవడం దినేష్‌రెడ్డి మనస్తత్వానికి విరుద్ధం. ఆయన ఇంతకాలం పెంచుకొంటూ వచ్చిన మంచి పేరుకు అనర్థం. ఒకపక్క ఆనం వారితో స్నేహం మరొకపక్క విధి నిర్వహణలో తన నిక్కచ్చితత్వం... చాలా సంకటంలో పడిపోయి వున్నాడు దినేష్‌రెడ్డి గారు. చివరికొచ్చేసరికి ఆయన మొగ్గు ఎటు తేలుతుందో వేచి చూద్దాం.

## భానుశ్రీ కన్ను

మొదటి పేజీ కొరవ

తంతు పూర్తి చేశారు. ఈ స్థలం విలువ 10కోట్ల రూపాయలు పైమాటేనని చెప్తున్నారు. తన భూ ఆక్రమణకు అడ్డం రాకుండా వుండడానికి వక్ఫ్ అధికారులకు, కొందరు ముస్లిం మత పెద్దలకు భారీమొత్తంలో లంచం ఇచ్చి నోరు మూయించాడట. మేయర్ భానుశ్రీ మాత్రం గట్టిగా ప్రతిఘటించడంతో 150 అంకణాల స్థలం ఆమెకు ఇచ్చేట్లు ఒప్పందం చేశాడట ఎమ్మెల్యే వివేకానంద రెడ్డి. వీరిద్దరూ సరే అన్న తర్వాత ఇక నెల్లూరు నగరంలో కాదనే ధైర్యం ఎవరికి వుంది. ఇప్పుడా స్మశానం చుట్టూ ప్రహరీ కట్టి, గేట్ బిగించి, తన ఆస్తిగా మార్చుకొన్నాడు కళ్యాణ్.

ఏమిటీ దుర్మార్గం? రాజకీయ పదవులు, అధికారం వుండేది ప్రజల ఆస్తులు దోచుకొని తినడానికా? ఈ దుర్మార్గాలకు అంతం అంటూ లేదా? జిల్లా కలెక్టర్ వంటి అధికారులు ఏమి చేస్తున్నారు? ఈ దుర్మార్గాలు ఆపాల్సిన బాధ్యత వారి మీద లేదా? కలెక్టర్ గారూ మీరు చప్పుగా, మెతకగా వుంటే లాభం లేదు. మీ హయాంలో స్మశానాలు కూడా అదృశ్యమై పోయాయన్న చెడ్డ పేరు తెచ్చుకొని, జిల్లా నుంచి వెళ్తే మీకెంతపాటి గౌరవం? ఆలోచన చేయండి.

## జనవాణి

2వ పేజీ కొరవ

జనతాపార్టీ ఇటీవలకాలంలో భ్రష్టుపట్టిపోయింది. కర్నాటకలో గెలిచేందుకు గాలి సోదరుల డబ్బును వాడుకోబట్టే ఆ పార్టీకి ఈ దుస్థితి సంభవించింది. గాలి సోదరుల ధనబలానికి, దుర్మార్గపు ఒత్తిడికి తలొగ్గి బిజెపి ఆ రాష్ట్రంలో పతనమైపోయింది. ధనబలానికి లొంగేదానికన్నా అధికారాన్ని వదలుకోవడానికి సిద్ధపడివుంటే బాగుండేది.

ఎం.శ్రీనివాసరావు, నెల్లూరు.

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

కరి హనీఫ్, చైతన్యప్రభ సంపాదకుడు చెంగల్ రాజు కుటుంబాలకు చెరి 50వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేస్తానని జిల్లా కలెక్టర్ రాంగోపాల్ హామీ ఇచ్చారు. 22వ తేది చెముదుగుంటలోని దుర్గా ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ వార్షిక మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ మేరకు వాగ్దానం చేశారు. జర్నలిస్టుల కుటుంబాల పట్ల ఈమాత్రం సానుభూతి చూపి ముందుకొచ్చిన జిల్లాకలెక్టర్ ఇప్పటివరకు లేడు.

### డిఇఓ ఆఫీసులో కుర్చీలాట!

నెల్లూరు డిఇఓ ఆఫీసులో కుర్చీల కోసం కుమ్ములాట జరుగుతుంది. పాలనా సౌలభ్యం కోసం కార్యాలయంలో వివిధ విభాగాల్లో పని చేసే వారిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదలీ చేస్తుంటారు. డిఇఓ ఆఫీసులో బాగా డబ్బులొచ్చే ప్రైవేటు స్కూళ్ల ఏర్పాటుకు అనుమతులిచ్చే విభాగంతోపాటు పదవ తరగతి పరీక్షల నిర్వహణ విభాగంలో పోస్టింగ్‌ల కోసం పలువురు పైరవీలు చేస్తుండడంతో జిల్లా విద్యాశాఖాధికారికి తలబొప్పి కట్టిపోతుంది.

### కొళాయిల్లో మురికినీరు!

నెల్లూరు కార్పొరేషన్ కొళాయిల ద్వారా సరఫరా చేసే నీళ్లు మళ్లీ మురికిగా వస్తున్నాయి. పెన్నానది బావుల్లో మంచినీళ్లు వున్నా ట్యాంకులు అపరిశుభ్రంగా వుండడం, మధ్యమధ్యలో పైపులు పగిలి పోవడం, అధికారులు వాటిని రెండు మూడు రోజుల వరకు పట్టించుకోక పోవడంతో ప్రజలు మురికినీరు పట్టుకోవాల్సి వస్తున్నది.

## వివాదాల నెగడు

5వ పేజీ కొరవ

బకాయిలు చెల్లించేందుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో దివాకర్ చేస్తున్న పనివల్ల తాము నష్టపోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 11 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి శిథిలావస్థకు చేరింది. వందసంవత్సరాల క్రితం నిర్మించిన భవనాలు శిథిలమైపోయి, నిర్వాహకులను వెక్కిరిస్తున్నాయి. ఎటుచూసినా ముళ్ల పొదలు అల్లుకపోయినట్లు, ఆకులతో ఈ ప్రాంతమంతా కప్పబడిపోయింది. ఫర్నిచర్ కూడా కొంత భాగం చెదలుపట్టగా మరికొంత ఫర్నిచర్ అపహరణకు గురికాబడింది. జిల్లా వైద్యరంగంలో ఎంతో చరిత్ర కలిగిన బాప్టిస్టు క్రిస్టియన్ హాస్పిటల్ ఆస్తుల విక్రయంతో వివాదంలో చిక్కుకోవడం బాధాకరం.

# దినేష్‌రెడ్డికి ఇసుక సంకటం

**ఆనం సోదరులకు, దినేష్‌రెడ్డికి దగ్గరి సంబంధాలున్నాయి. స్నేహ బంధుత్వం వుంది. సహజంగానే వారు ఆయన్ను మొగమాట పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.**

రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ దినేష్‌రెడ్డి పెద్ద ఇరకాటంలో పడిపోయారు. పోలీసుశాఖలో దినేష్‌రెడ్డికి ప్రత్యేక గుర్తింపు వుంది. నిజాయితీపరుడిగా గౌరవం వుంది. ఎవరి ఒత్తిళ్లకూ లొంగడన్న కీర్తి వుంది. తన సర్వీస్ మొత్తం ఆ హూందాతనాన్ని కాపాడుకొంటూ వస్తున్నాడు. ఆయన వల్ల పెద్దగా ప్రయోజనం లేదనే ఉదాసీనతతో చంద్రబాబు నాయుడు తొమ్మిదేళ్లపాటు పనికిమాలిన పోస్టులలో నియమించి, పక్కన పెట్టాడు. వైఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆయనకు శాప విమోచనం లభించింది. హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్‌గా, ఆర్టీసి మేనేజింగ్ డైరక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించాడు. ఇప్పటి ముఖ్యమంత్రి రోశయ్య ఆయన్ను విజిలెన్స్ డైరక్టర్ జనరల్‌గా నియమించాడు. యూనిఫామ్ లేదన్న కొరత తప్ప, పోలీసు శాఖలో అత్యంత శక్తివంతమైన ఉద్యోగం ఇది. మొత్తం ప్రభుత్వ యంత్రాంగంలో ఏ శాఖనైనా నియంత్రించే అధికారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ జనరల్‌కు వుంటుంది. తప్పు చేసే వారిని చొక్కా పట్టుకొని నిలేయవచ్చు. చట్టం ముందు దోషిగా నిలబెట్టవచ్చు. ప్రజాధనం, ఆస్తులు దుర్వినియోగం కాకుండా అడ్డుకోవచ్చు. విజిలెన్స్ డైరక్టర్ జనరల్ అధికార పరిధి చాలా విస్తృతమైనది. అవధులు లేనిది. ఆ కర్తవ్య నిర్వహణకు దినేష్‌రెడ్డి అన్నివిధాలా సమర్ధుడు. అర్హుడు.

కానీ మనిషి సంఘజీవి. సమాజంలో బ్రతకాలంటే కొన్ని బంధనాలు తప్పవు. హిమాలయాలలో ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనే వారి వలె వ్యవహరించడం జరిగే పనికాదు. ఎంత కాదనుకొన్నా కొన్ని బంధాలు కాళ్లకు అడ్డు పడతాయి. వాటిని లెక్కించకుండా నిగ్రహం పాటించడం చాలా కష్టం. దినేష్‌రెడ్డికి అటువంటి సంకటమే ఎదురైంది ఇప్పుడు.

కొరవ 14వ పేజీలో



ఏ దేశమేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

## పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.

1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- | జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

# శ్రద్ధాంజలి



కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
పార్లమెంటు మాజీసభ్యులు - ఒంగోలు
జననం 20-11-1947 మరణం 01-12-1995

ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రతి ఒక్కరికి ఆదర్శం మీ మార్గం
**కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు**
ఒంగోలు పార్లమెంటు మాజీ సభ్యులు
**14వ వర్ధంతి సందర్భంగా**
వారి ఆత్మకు శాంతికలగాలని ప్రార్థిస్తూ...
**కుటుంబసభ్యులు మరియు అభిమానులు**

తేది 1-12-2009 మంగళవారం ఉదయం 11గంటల నుండి
నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీరాఘవకళ్యాణమండం నందు
**అన్నదాన కార్యక్రమం జరుగును.**

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.